https://prajapratibha.com
RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక


సంపుటి: 13 | సంచిక: 252 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల: రూ.5.00 | పేజీలు: 17

ఆంధ్రప్రదేశ్ | Published from Andhra pradesh & Telangana | బుధవారం, మే20, 2026



ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత
ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

2 లో




## తీరం మనదే.. బోటు మనదే..
# వేటా మనదే

- మత్స్యకారుల సేవలో పథకం కింద 1.30 లక్షల కుటుంబాలకు రూ. 262 కోట్లు విడుదల
- ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక చేయూత
- 60 శాతం సబ్సిడీతో 200 మెకనైజ్డ్ బోట్లు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ
- తీరం మనది, బోటు మనదే, వేటా మనదే అంటూ మత్స్యకారులకు భరోసా
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో ఆర్థిక బలోపేతం చేస్తామన్న ముఖ్యమంత్రి

## ● మత్స్యకారులకు సీఎం చంద్రబాబు భరోసా



**నెల్లూరు/కావలి ప్రతినిధి, మే19 (ప్రజా ప్రతిభ):** మత్స్యకారుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కావలి నియోజక వర్గంలోని తుమ్మలపెంటలో నేడు జరిగిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వేట నిషేధ భృతి కింద రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ. 20 వేల చొప్పున, మొత్తం రూ. 262 కోట్ల ఆర్థిక సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు.
ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "సముద్రంలో చేపల వేట అంటే ప్రాణాలతో చెలగాటమాడటమే. రోజుల తరబడి

మిగతా 2లో..

## దేశంలో చాపకింద నీరులా
# మతమార్పిళ్లు



- నాసిక్ ఘటన మరువకముందే మరో ఘటన
- యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు
- పదిమంది నిందితుల అరెస్ట్.. ముమ్మర దర్యాప్తు

**లక్నో,మే19(ప్రజా ప్రతిభ):** నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మిర్జాపుర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న

మిగతా 2లో..



## కృష్ణమ్మపై 100 పడవల
# వినూత్న ర్యాలీ

- మత్స్యకార భరోసా నిధుల విడుదలకు గంగపుత్రుల కృతజ్ఞతాభివందనం
- ఉండవల్లిలో మత్స్యకారులకు స్వాగతం పలికిన మంత్రి నారా లోకేష్

**అమరావతి, మే 19 (ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన 'మత్స్యకార భరోసా' పథకం కింద నిధుల విడుదలపై రాష్ట్ర మత్స్యకారులు వినూత్న రీతిలో తమ కృతజ్ఞతలు తెలియజేశారు. వందలాది మంది మత్స్యకారులు సుమారు 100 పడవలతో కృష్ణానదిపై భారీ ర్యాలీ నిర్వహించి, ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణమ్మ ఒడిలో పడవల సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

మిగతా 2లో..



## వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు సీరియస్

- రోడ్లపై సంచారానికి చెక్.. షెల్టర్ హోమ్స్‌లోనే ఉంచాలని ఆదేశం
- కుక్క కాటు ఘటనలు భయంకర స్థాయికి చేరాయన్న ఆందోళన
- రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై ధర్మాసనం ఆగ్రహం

**న్యూఢిల్లీ, మే 19 (ప్రజా ప్రతిభ):** దేశవ్యాప్తంగా పెరుగుతున్న వీధి కుక్కల దాడులు, కుక్క కాటు ఘటనలపై సుప్రీంకోర్టు

మిగతా 2లో..




## విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

- సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత
- తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

మిగతా 2లో..

**చెన్నై,మే19(ప్రజా ప్రతిభ):** ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.




## యూజిసి నెట్ దరఖాస్తులకు నేడే చివరిరోజు


దరఖాస్తు చేయని వారు ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం

**న్యూఢిల్లీ,మే19(ప్రజా ప్రతిభ):** యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక హెచ్చరిక జారీ చేసింది. జూన్ 2026 సెషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ మే 20తో ముగియనున్నట్లు వెల్లడించింది. ఇంకా దరఖాస్తు

మిగతా 2లో..

## స్వయంగా చేపలు కొని, గరిటె తిప్పి..
### మత్స్యకార కుటుంబంతో చంద్రబాబు భోజనం

- కావలి నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన
- చేపల మార్కెట్‌ను సందర్శించి స్వయంగా చేపలు కొనుగోలు చేసిన సీఎం
- ఓ మత్స్యకారుడు ఇంటి చేపల కూరతో భోజనం
- అందరితో పాటే కింద కూర్చుని భోజనం చేసిన చంద్రబాబు
- ఆనందంతో పొంగిపోయిన మత్స్యకారుడి కుటుంబం



**కావలి, మే 19 (ప్రజా ప్రతిభ):** ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం నాడు ఓ మత్స్యకార కుటుంబం ఇంట్లో సొంత కుటుంబ సభ్యుడిలా గడిపారు. స్వయంగా మార్కెట్‌లో చేపలు కొని, వారింటికి తీసుకెళ్లి, వంట చేస్తుండగా సరదాగా గరిటె తిప్పారు. ఆపై ఆ కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేసి అందరినీ ఆశ్చర్య పరిచారు. ఈ ఆసక్తికర ఘటన నెల్లూరు జిల్లా కావలిలో చోటుచేసుకుంది.
వివరాల్లోకి వెళితే... శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు తుమ్మలపెంట గ్రామానికి వెళ్లారు. అక్కడ 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న

మిగతా 2లో..



## ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.919.13 కోట్లు విడుదల

- వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి,మే19(ప్రజా ప్రతిభ):** ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.919.13 కోట్లను విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

మిగతా 2లో..

## ఐదేళ్లు ప్రజల్ని బాది.. ఇప్పుడు
# ధర్నాలంటూ డ్రామాలా..?

- వైసీపీపై సోమిరెడ్డి ఫైర్



- పెట్రోల్ ధరలపై వైసీపీ ధర్నాలు ఓ పెద్ద డ్రామా అని విమర్శించిన సోమిరెడ్డి
- జగన్ హయాంలో దేశంలోనే అత్యధిక ధరలతో ప్రజలను దోపిడీ చేశారని ఆరోపణ
- మద్యం ధరలు పెంచి, కల్తీ మద్యం అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు
- వైసీపీ నిరసనలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, సొంత పార్టీ నేతలే అసహనంగా ఉన్నారని వ్యాఖ్య
- జగన్‌పై ఉన్న అవినీతి కేసుల విచారణ వేగవంతం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వెల్లడి

**మంగళగిరి, మే 19 (ప్రజా ప్రతిభ):** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైసీపీ నాయకులు చేస్తున్న ధర్నాలు ఓ పెద్ద డ్రామా అని, ఐదేళ్ల పాటు ప్రజల జేబులు గుల్ల చేసి ఇప్పుడు రోడ్డెక్కడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ సీనియర్ నేత, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నేడు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వ హయాంలో

మిగతా 2లో..



## పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై
# కేంద్రమంత్రి ఆరా

నేరుగా ఫోన్ చేసి పలకరించిన ప్రహ్లాద్ జోషి

**అమరావతి,మే19(ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఫోన్ చేసి ఆరా తీశారు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు

మిగతా 2లో..



## ఏపీలో వెయ్యి మినీ మార్టులు

తక్కువ ధరలకే సరుకులు అందచేస్తాం
పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**న్యూఢిల్లీ,మే19(ప్రజా ప్రతిభ):** రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి



మిగతా 2లో..

## బటన్లు నొక్కడం తప్ప
# జగన్ చేసిందేమీ లేదు

- వైఎస్సార్ ఆశయాలను జగన్ నాశనం చేశారు: వైఎస్ షర్మిల
- బటన్లు నొక్కినంత మాత్రాన మళ్లీ సీఎం కాలేరని వ్యాఖ్య
- బీజేపీతో అక్రమ పొత్తు పెట్టుకున్నారంటూ విమర్శలు



2 పేజీలో



# స్వయంగా చేపలు కొని, గరిటె తిప్పి..

మొదటిపేజీ తరువాయి..

అనంతరం స్థానిక చేపల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి మహిళా వ్యాపారుల నుంచి చేపలు కొనుగోలు చేశారు.



అనంతరం, మార్కెట్‌లో పరిచయమైన మత్స్యకారుడు తానంగారి బాబు ఆహ్వానం మేరకు సీఎం ఆయన ఇంటికి వెళ్లారు. తాను తెచ్చిన చేపలను వండమని తానంగారి బాబు భార్య వెంకమ్మకు ఇచ్చారు. ఆమె చేపల పులుసు వండుతుండగా, చంద్రబాబు అక్కడే ఉండి ఆసక్తిగా గమనించారు. కొద్దిసేపు ఆయన కూడా గరిటె తిప్పారు. వంట పూర్తయ్యాక, సీఎం చంద్రబాబు వారి కుటుంబ సభ్యులతో కలిసి కిందనే కూర్చుని భోజనం చేశారు. తన చేతులతో వారికి చేపల పులుసు వడ్డించడం విశేషం. తమ ఇంటికి వచ్చి, తమతో కలిసి భోజనం చేసిన ముఖ్యమంత్రికి తానంగారి బాబు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

# కృష్ణమ్మపై 100 పడవల వినూత్న ర్యాలీ

మొదటిపేజీ తరువాయి..

పడవల్లో తరలివచ్చిన మత్స్యకారులకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ఆత్మీయ స్వాగతం పలికారు. వారితో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ, మత్స్యకార భరోసా నిధుల విడుదలతో తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని పేర్కొన్నారు.



ప్రభుత్వం తమ సమస్యలను అర్థం చేసుకుని అండగా నిలుస్తోందని చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఘటనపై మంత్రి నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, “మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చాను. గంగపుత్రులు చూపిన ఈ అరుదైన కృతజ్ఞత, వారి అభిమానం వెలకట్టలేనిది” అని పేర్కొన్నారు. మత్స్యకారుల భారీ పడవల ర్యాలీ, ప్రభుత్వంపై వారు వ్యక్తం చేసిన విశ్వాసం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కృష్ణానదిపై సాగిన ఈ వినూత్న కృతజ్ఞతా యాత్రకు స్థానిక ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభించింది.

# బటన్లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు

విజయవాడ, మే 19 (ప్రజా ప్రతిభ):

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. తండ్రి వైయస్సార్ ఆశయాల పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్, పాలనలో మాత్రం ఆ ఆశయాలకు తూట్లు పొడిచారని ఆమె ఆరోపించారు.

విజయవాడలో మీడియాతో మాట్లాడిన షర్మిల, గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలు కంటే “స్విచ్‌లు నొక్కడం”కే పరిమితమైందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పేరుతో బటన్లు నొక్కినంత మాత్రాన ప్రజలు మళ్లీ అధికారంలోకి తీసుకురారని వ్యాఖ్యానించారు.

### ప్రజాప్రతినిధులకు కూడా అపాయింట్‌మెంట్ దొరకలేదన్న షర్మిల

మాజీ సీఎం వైయస్. జగన్మోహన్ రెడ్డి పాలనలో ఎమ్మెల్యేలు, ఎంపీలకే అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి నెలకొందని షర్మిల విమర్శించారు. వైఎస్సార్ పేరు చెప్పి ఓట్లు అడిగి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఆశయాలను పూర్తిగా పక్కనపెట్టారని ఆరోపించారు.

### ధర్నాలు చేయడం సిగ్గుచేటు..

గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు ఇప్పుడు ధర్నాలు, నిరసనలు చేపట్టడం సిగ్గుచేటని షర్మిల అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను పట్టించుకోని వారు ఇప్పుడు ప్రజల తరఫున మాట్లాడటం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు.

### బీజేపీతో అక్రమ పొత్తు పెట్టుకున్నారన్న ఆరోపణ

జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ అక్రమ రాజకీయ పొత్తు కొనసాగించారని షర్మిల ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ లాభాలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

# ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.919.13 కోట్లు విడుదల

మొదటిపేజీ తరువాయి..

యాదవ్ ఓ ప్రకటన విడుదల చేశారు. బకాయిల చెల్లింపుల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో నిధులు విడుదల చేసినట్లు వివరించారు. 785 ప్రైవేట్ ఆస్పత్రులు బిల్ డిస్కౌంటింగ్‌కు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఆస్పత్రుల ఖాతాలకు ఇప్పటికే రూ.919.13 కోట్ల జమ చేశామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ చక్రధరబాబు.. మంత్రికి నివేదిక అందజేశారు. ఆస్పత్రుల విజ్ఞప్తి మేరకు వేగంగా బకాయిలు చెల్లించామని అన్నారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేశారని తెలిపారు. ట్రస్టు - ఆస్పత్రులు - పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ మధ్య ఒప్పందాలు జరిగాయని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ ఆస్పత్రులకు మొత్తం రూ.5,556 కోట్లు చెల్లించామని తెలిపారు.

అదనంగా మరో రూ.919.13 కోట్లు విడుదల చేశామని అన్నారు. ఆరోగ్య సేవల బలోపేతానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

# తీరం మనది.. బోటు మనదే.. వేటా మనదే




మొదటిపేజీ తరువాయి..

సముద్రంలోనే ఉండి జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు ఉండే వేట నిషేధ సమయంలో వారి కుటుంబాలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆర్థిక చేయూత అందిస్తున్నాం. గతంలో రూ.10 వేలుగా ఉన్న సాయాన్ని, మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు పెంచాం” అని తెలిపారు. వరుసగా రెండో ఏడాది కూడా ఈ పథకం ద్వారా సాయం అందిస్తున్నామని, రెండేళ్లలో మొత్తం రూ.505 కోట్లను మత్స్యకారులకు అందించామని గుర్తుచేశారు.

### మత్స్యకారులకు వరాల జల్లు..

ఈ సభలో ముఖ్యమంత్రి మత్స్యకారుల కోసం పలు కీలక హామీలు ప్రకటించారు. 60 శాతం సబ్సిడీపై 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన మొత్తాన్ని సులభ వాయిదాల్లో రుణంగా అందిస్తామని హామీ ఇచ్చారు. “తీరం మనది, బోటు మనదే, వేటా మనదే. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. మన తీరప్రాంతంలోకి పొరుగు రాష్ట్రాల బోట్లు వస్తే సహించేది లేదు. మత్స్యకారుల హక్కులను కాపాడటానికి నిఘా పెంచుతాం” అని చంద్రబాబు చెప్పారు.

రాష్ట్రంలో మత్స్యకారుల అభివృద్ధికి రూ. 3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రూ. 288 కోట్లతో చేపడుతున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం ఆర్థికంగా బలపడుతుందని, దీనిపై కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. నెల్లూరు జిల్లాలోని 25 మత్స్యకార గ్రామాలను కలుపుతూ మెటల్ రోడ్లు నిర్మిస్తామని, రూ.6.19 కోట్లతో నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీత పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

### అదనపు ఆదాయం.. సాంకేతికతపై దృష్టి

చేపల వేటతో పాటు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా అదనపు ఆదాయం పొందాలని మత్స్యకారు



లకు సీఎం సూచించారు. “సీవీడ్ (సముద్రపు నాచు) సాగు ద్వారా మత్స్యకార మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతాం. దీనికి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. మత్స్యకారులు పండించే చేపలకు మంచి ధర వచ్చేలా నేనే మార్కెటింగ్ మేనేజర్‌గా వ్యవహరిస్తా” అని భరోసా ఇచ్చారు. మత్స్యకారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్‌పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేశామని వివరించారు.

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, దానిని సరిచేయడానికే 23 నెలల సమయం పట్టిందని చంద్రబాబు విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వానికి తమ మద్దతు తెలిపారు. కృష్ణానదిలో బోట్లతో భారీ ర్యాలీ నిర్వహించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# ఐదేళ్లు ప్రజల్ని బాది.. ఇప్పుడు ధర్నాలంటూ డ్రామాలా..?

మొదటిపేజీ తరువాయి..

తీవ్రస్థాయిలో దోపిడీ జరిగిందంటూ ధ్వజమెత్తారు.

“జగన్ సీఎంగా ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్ ధరల్లో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టారు. అడ్డగోలుగా రోడ్ సెస్ వేసి, వ్యాట్ పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ధరలు పెంచిన మాట వాస్తవమే అయినా, దాన్ని పట్టుకుని మీరిప్పుడు ధర్నాలు చేస్తారా..?” అని సోమిరెడ్డి ప్రశ్నించారు.

జగన్ హయాంలో విజయవాడలో లీటర్ పెట్రోల్ ధర రూ. 112 ఉంటే, పక్కనే ఉన్న కర్ణాటకలో రూ. 101 మాత్రమే ఉండేదని, అంటే లీటర్‌కు రూ. 11 చొప్పున ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. “నేను బెంగళూరు వెళ్లినప్పుడు, తిరిగొస్తూ కర్ణాటక బార్డర్‌లోనే కారు ఫుల్ ట్యాంక్ చేయించుకునేవాడిని. 50 లీటర్లకు రూ. 550 ఆదా అయ్యేవి. అంత దారుణంగా రాష్ట్రాన్ని లూటీ చేశారు” అని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో ఒక్క పైసా కూడా పెంచలేదని, జగన్ పెంచిన పాత ధరల పాపాన్ని మోస్తూనే ఇప్పుడు వైసీపీ సిగ్గులేకుండా ధర్నాలు చేస్తోందని ధ్వజమెత్తారు.

మద్యంపై ‘జగనన్న టాక్స్’ పేరుతో విపరీతంగా ధరలు పెంచి, నాసిరకం బ్రాండ్లు అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని సోమిరెడ్డి ఆరోపించారు. ధరలు పెంచితే తాగడం తగ్గిస్తారనే వింత వాదనతో జనాన్ని బాదారని, పక్క రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చుకోకుండా కఠిన ఆంక్షలు విధించారని మండిపడ్డారు. “మేం చెప్పిన మందే తాగాలి అంటూ కల్తీ మద్యం అమ్మి, గత ఐదేళ్లలో 30 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోవడానికి, లక్షల మంది అనారోగ్యం పాలు కావడానికి కారణమయ్యారు. ఇన్ని అరాచకాలు చేసి ఏ ముఖం పెట్టుకుని రోడ్ల మీదకు వస్తున్నారు..?” అని నిలదీశారు.

రూ. 43,000 కోట్ల అవినీతి ఆరోపణలతో 13 సీబీఐ కేసుల్లో 15 ఏళ్లుగా జగన్ ప్రధాన ముద్దాయిగా ఉన్నారని, ఈ కేసుల విచారణ వేగవంతమై న్యాయం జరగాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. వైసీపీ నిర్వహించిన నిరసన కార్యక్రమాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని, వంద మందిని కూడా సమీకరించలేకపోయారని ఎద్దేవా చేశారు. “ధర్నాల్లో పాల్గొన్న వైసీపీ కార్యకర్తలే ‘ధరలు పెంచింది మనమే కదా, ఇప్పుడీ ధర్నాలేంటి..?’ అని గుసగుసలాడుకుంటున్నారు. ఇదీ వైసీపీ ప్రస్తుత పరిస్థితి” అని సోమిరెడ్డి వ్యాఖ్యానించారు.

# ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

### ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

న్యూయార్క్,మే19(ప్రజా ప్రతిభ): అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా రుజువులు లేవని తేల్చింది. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. ఎస్ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవ డానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తఎల్‌పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసి) దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

# పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై కేంద్రమంత్రి ఆరా

మొదటిపేజీ తరువాయి..

అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొన్నిరోజుల క్రితం పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ముక్కుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. వైద్యుల సూచన మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. 'మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆరోగ్యం అన్నిటికన్నా ముఖ్యం. మీ ఆరోగ్యం బాగుంటేనే ప్రజల కోసం మరింత సమర్థంగా పని చేయగలుగుతారు' అంటూ పవన్ కల్యాణ్‌ను ఫోన్‌లో ప్రహ్లాద్ జోషి పరామర్శించారు. రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. 'నేను ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను' అని డిప్యూటీ సీఎంకు చెప్పారు. అంతేకాకుండా పవన్ ఆరోగ్యం కోసం తాను తిరుపతి బాలాజీని ప్రార్థిస్తున్నానని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

# ఏపీలో వెయ్యి మినీ మార్టులు

మొదటిపేజీ తరువాయి..

ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందు బాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.



# వీధి కుక్కల బెడదపై సుప్రీంకోర్టు సీరియస్

మొదటిపేజీ తరువాయి..

తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై సంచరించే వీధి కుక్కలను తొలగించాలని గతంలో ఇచ్చిన ఆదేశాలను కొనసాగించింది. ఈ మేరకు ఆ ఉత్తర్వులను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను మంగళవారం కొట్టివేసింది.

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేసిన తర్వాత కూడా వీధి కుక్కలను మళ్లీ అదే ప్రాంతాల్లో వదిలిపెట్టకూడదని స్పష్టం చేసింది.

జంతు హక్కుల కార్యకర్తలు కుక్కల స్థాన మార్పు వల్ల అవి మరింత దూకుడుగా మారే అవకాశం ఉందని వాదించినప్పటికీ, ధర్మాసనం ఆ అభిప్రాయంతో ఏకీభవించలేదు. ప్రస్తుతం వీధి కుక్కల సంచారం ఆందోళనకర స్థాయికి చేరిందని పేర్కొంది.

ప్రత్యేకించి చిన్నారులపై జరుగుతున్న కుక్కల దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. కొన్ని ఘటనల్లో పిల్లల ముఖాలపై దాడులు జరిగి తీవ్ర గాయాలు కావడం వంటి సంఘటనలను విస్మరించలేమని స్పష్టం చేశారు.

‘యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా’ రూపొందించిన ప్రామాణిక విధానాల ప్రకారం పట్టుబడిన వీధి కుక్కలను శాశ్వతంగా జంతు సంరక్షణ కేంద్రాల్లోనే ఉంచాలని, వాటిని తిరిగి రోడ్లపైకి వదలరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘించే అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపైనా ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. వీధి కుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వాటికి అనుగుణంగా జంతు సంరక్షణ కేంద్రాల సామర్థ్యాన్ని పెంచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడింది. ముందస్తు ప్రణాళిక లేకుండా చేపట్టిన స్టెరిలైజేషన్ కార్యక్రమాల కారణంగానే సమస్య మరింత జటిలంగా మారిందని అభిప్రాయపడింది.

# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

మొదటిపేజీ తరువాయి..

డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు‘ అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు. ఒకప్పుడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.

# యూజిసి నెట్ దరఖాస్తులకు నేడే చివరిరోజు

మొదటిపేజీ తరువాయి..

చేయని అభ్యర్థులు వెంటనే అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి అప్లై చేయాలని సూచించింది. యూజీసీ నెట్ 2026 పరీక్షలు జూన్ 22 నుంచి 30 వరకు కంప్యూటర్- బేస్డ్ టెస్ట్ మోడ్‌లో జరగనున్నాయి. మొత్తం 85 సబ్జెక్టులకు ఈ పరీక్ష జరుగుతుంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఈ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుంది. అభ్యర్థులు దరఖాస్తు నింపి, ఫీజు చెల్లించిన తర్వాత తప్పనిసరిగా కన్ఫర్మేషన్ పేజ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని ఎన్‌టీఏ సూచించింది. ఫీజు చెల్లింపు తర్వాత మాత్రమే దరఖాస్తు పూర్తి అయినట్లుగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మే 20 చివరి తేదీ. మే 22 నుంచి మే 24 వరకు సవరణలు చేసుకునే వీలుంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు తమ దరఖాస్తులోని వివరాలను సవరించుకునే అవకాశం ఉంటుంది. అడ్మిట్ కార్డులు జూన్ 15న విడుదలయ్యే అవకాశం ఉందని ఎన్‌టీఏ తెలిపింది. పరీక్ష కేంద్ర సమాచారం అభ్యర్థులకు జూన్ 10 నాటికి తెలుస్తుంది. అభ్యర్థులు అధికారిక ద్వారా అప్లై చేసుకోవచ్చు.

# దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

మొదటిపేజీ తరువాయి..

నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మిర్జాపుర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. నిందితులపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కేసులో ఇప్పటివరకు 10మంది అనుమానితులను అరెస్ట్ చేశామని.. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

# రాబోయే రోజుల్లో కావలి ‘కనకపట్నం’గా పాత పేరు సార్థకం అవుతుంది: సీఎం చంద్రబాబు





కావలి ప్రతినిధి, మే19 (ప్రజా ప్రతిభ):

- కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో చంద్రబాబు సభ
- మత్స్యకార సేవలో భాగంగా 1.30 లక్షల కుటుంబాల ఖాతాల్లోకి రూ.262 కోట్లు జమ
- వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- తీరం మనదే, వేట మనదేనని.. ఇతర రాష్ట్రాల మత్స్యకారులను అనుమతించేది లేదని స్పష్టీకరణ
- కావలికి పలు అభివృద్ధి పనుల మంజూరు
- వేదికపైనే అధికారుల పనితీరును సమీక్షించిన సీఎం



రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తన ప్రభుత్వ లక్ష్యమని, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంటలో మంగళవారం జరిగిన ‘మత్స్యకార సేవలో’ కార్యక్రమంలో ఆయన పాల్గొని సుదీర్ఘ ప్రసంగం చేశారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచేందుకు 1,30,796 కుటుంబాలకు రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 262 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం గత ప్రభుత్వమిచ్చిన రూ.10 వేల భృతిని రూ.20 వేలకు పెంచామని గుర్తుచేశారు.

ఒకప్పుడు వాణిజ్య వైభవంతో తులతూగి ‘కనకపట్నం’గా పేరుగాంచిన కావలి, మళ్ళీ తన పూర్వపు కీర్తిని సంతరించుకో బోతోందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. అభివృద్ధి పథంలో శరవేగంగా దూసుకెళ్లి, ఆ పేరును సార్థకం చేసుకోబోతోందని అన్నారు. ఇది కేవలం ఆశాభావం కాదని, తాము ఇస్తున్న స్పష్టమైన హామీ అని తెలిపారు.





### కనకపట్నం’ కావలికి వరాల జల్లు

స్థానిక ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి విజ్ఞప్తి మేరకు, కావలి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి వరాల జల్లు కురిపించారు. ఈ ప్రకటనలతో కావలి భవిష్యత్ చిత్రం కళ్ళకు కట్టినట్టయింది.

25 మత్స్యకార గ్రామాలను అనుసంధానించేందుకు రూ. 6.27 కోట్లతో మెటల్ రోడ్ల నిర్మాణం.

రైతులు, మత్స్యకారులకు జీవనాధారమైన బకింగ్‌హామ్ కాలువ పూడికతీత పనులకు రూ. 6.9 కోట్లు.

ప్రాంతంలో దీర్ఘకాలిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి అత్యంత కీలకమైన 220/133/33 కేవీ సబ్‌స్టేషన్‌కు తక్షణ ఆమోదం. ఈ పనుల విలువ రూ. 13 కోట్లకు పైగా ఉండటంతో, రాబోయే రోజుల్లో కావలి రూపురేఖలు మారనున్నాయని స్పష్టమైంది. దీనికి తోడు రామాయపట్నం పోర్టు, దగదర్తి విమానాశ్రయం, సమీప ఇండస్ట్రియల్ కారిడార్లతో ఈ ప్రాంతం అభివృద్ధికి మకుటాయమానంగా నిలుస్తుందని, కావలి నిజమైన ‘కనకపట్నం’గా విలసిల్లుతుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

### అలలపై బతుకులకు... రూ. 20 వేల అండ

ప్రాణాలను పణంగా పెట్టి, సముద్రపు అలలతో నిత్యం పోరాడే మత్స్యకార సోదరుల కష్టాలు తనకు తెలుసంటూ ప్రసంగం ప్రారంభించిన ముఖ్యమంత్రి, వారి కుటుంబాలకు అండగా నిలవడమే తన ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఉద్ఘాటించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం, వేట నిషేధ భృతిని రూ.10,000 నుంచి ఏకంగా రూ.20,000కు పెంచుతున్నట్లు ప్రకటించి, సభా ప్రాంగణంలో హర్షాతిరేకాలు నింపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ఇందుకోసం రూ. 262 కోట్లను బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు తెలిపారు. “మీరు ధైర్యంగా వేటకు వెళ్ళండి. మీ కుటుంబాలను ఆదుకునే బాధ్యత నాది. మీ కష్టాన్ని గుర్తించి, గౌరవించే ప్రభుత్వం ఇది” అని చంద్రబాబు భరోసా ఇచ్చారు.

### ‘తీరం మనదే.. వేట మనదే’.. పొరుగువారికి సింహగర్జన..

మత్స్యకారుల హక్కుల పరిరక్షణ విషయంలో తన ప్రభుత్వం ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో ముఖ్యమంత్రి తన మాటల్లో స్పష్టం చేశారు. “తీరం మనదే, బోటు మనదే, వేట మనదే. ఈ విషయంలో ఎలాంటి రాజీకి తావులేదు. మన సముద్ర జలాల్లోకి పొరుగు రాష్ట్రాల బోట్లు అక్రమంగా ప్రవేశిస్తే ఉపేక్షించేది లేదు. వారిని వెంటాడతాం, వేటాడతాం. మన మత్స్యకారుల సంపదను దోచుకోవడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవు” అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. తీర ప్రాంతంలో నిఘా ను పటిష్ఠం చేస్తా మని, పెట్రోలింగ్ బోట్ల సంఖ్యను పెంచుతామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, మత్స్యకారుల చిరకాల వాంఛను నెరవేరుస్తూ, 60 శాతం సబ్సిడీతో 200 అత్యాధునిక మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో మత్స్యకారులు ఆనందంతో కేరింతలు కొట్టారు.

### సముద్రపు నాచుతో మహిళల జీవితాల్లో మార్పు..

కేవలం తక్షణ సాయంతోనే సరిపెట్టకుండా, మత్స్యకారులను ఆర్థికంగా ఉన్నత స్థానంలో నిలబెట్టడమే తన లక్ష్యమని చంద్రబాబు అన్నారు. “సముద్ర గర్భంలో అపార సంపద దాగి ఉంది. దానిని మీ అభివృద్ధికి సోపానంగా మారుస్తాను. మగవారు వేటకు వెళ్తే, మన ఆడబిడ్డలు తీరంలోనే ఉంటూ అదనపు ఆదాయం సంపాదించే మార్గం చూపిస్తాను” అంటూ సముద్రపు నాచు (సీవీడ్) సాగు ప్రాజెక్టును ఆవిష్కరించారు.

“ఈ సీవీడ్‌కు అంతర్జాతీయంగా భారీ డిమాండ్ ఉంది. మన డ్వాక్రా మహిళలకు ఆధునిక సాంకేతికత అందించి, దీని సాగులో శిక్షణ ఇప్పించి, వారిని పారిశ్రామికవేత్తలుగా మారుస్తాను. మీ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్ కల్పించే బాధ్యత నాది. నేను మీకు ముఖ్యమంత్రినే కాదు, ఒక ‘మార్కెట్ మేనేజర్’గా కూడా పనిచేస్తాను” అని హామీ ఇచ్చారు.

### వేదికపైనే అధికారులకు క్లాస్.. పాలనలో పరుగు

తన పాలనలో పారదర్శకతకు, జవాబుదారీతనానికి పెద్దపీట వేస్తానని చెప్పడమే కాదు, చంద్రబాబు దానిని వేదికపైనే ఆచరించి చూపారు. నెల్లూరు జిల్లాలో వివిధ శాఖల పనితీరుపై ప్రజల సంతృప్తి శాతాన్ని విశ్లేషిస్తూ, అధికారులకు అక్కడికక్కడే దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోనే అత్యధిక సంతృప్తి శాతం సాధించిన జిల్లా కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను పేరుపేరునా అభినందించారు. అదే సమయంలో, ఆర్టీసీ, దేవదాయ, గ్రామీణ నీటి సరఫరా వంటి శాఖల్లో పనితీరు మెరుగుపరుచుకోవాలని సున్నితంగా సూచించారు. “ప్రజాసేవలో అలసత్వం వద్దు. ప్రజల సంతృప్తే మనకు కొలమానం కావాలి” అని హితవు పలికారు.

# ‘నా దేశం – నా బాధ్యత’.. బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని వెనక్కి పంపిన పల్లా శ్రీనివాసరావు

- ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించేందుకు పల్లా శ్రీనివాసరావు కీలక నిర్ణయం
- వై-కేటగిరీ భద్రతలోని బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని పోలీసులకు అప్పగింత
- 202 గన్‌మన్ల స్థానంలో 101 సిబ్బందితోనే పర్యటనలు
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పిలుపు స్ఫూర్తితోనే ఈ నిర్ణయమన్న పల్లా
- ఈసారి మహానాడును కూడా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడి



గాజువాక, మే19 (ప్రజా ప్రతిభ):

ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంతో పాటు, ప్రజలకు ఆదర్శంగా నిలవాలనే ఉద్దేశంతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కీలక నిర్ణయం తీసుకున్నారు. తనకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపులకు అనుగుణంగా, “నా దేశం నా బాధ్యత” అనే స్ఫూర్తితో తన భద్రతా వ్యవస్థను కుదించుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం పల్లా శ్రీనివాసరావుకు వై-కేటగిరీ భద్రత ఉంది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఒక బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కేటాయించింది. అయితే, ప్రభుత్వ ధనాన్ని ఆదా చేయాలనే ఉద్దేశంతో ఆ వాహనాన్ని వినియోగించరాదని నిర్ణయించుకుని, దానిని పోలీస్ శాఖకు తిరిగి పంపించారు. దీంతో పాటు తన భద్రత కోసం కేటాయించిన 202 గన్‌మన్ల స్థానంలో 101 సిబ్బంది సరిపోతారని ఆయన అధికారులకు సూచించారు. ఇకపై తాను సొంత వాహనంలోనే నియోజకవర్గంలో పర్యటిస్తానని, గ్రీన్ ఛానల్, అధిక ఎస్కార్ట్ వంటి సౌకర్యాలను వినియోగించబోనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ, “పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధాని మోదీ సూచించారు. దుబారా ఖర్చులకు స్వస్తి పలికి, పొదుపు పాటించాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. వారి మాటలు స్ఫూర్తిగా తీసుకుని ‘నా దేశం-నా బాధ్యత’ అనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నాను” అని వివరించారు. ఇదే స్ఫూర్తితో ఈసారి తెలుగుదేశం పార్టీ మహానాడును కూడా సాంకేతికతను వాడుకుంటూ ఈ-డిజిటల్, ఆన్‌లైన్ వేదికగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధుల ఆడంబరాలు తగ్గించుకోవడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చనే సందేశాన్ని తన చర్యల ద్వారా పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## సానికవరం గ్రామంలో సుందరయ్య స్మారక విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహణ





యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 19,(ప్రజా ప్రతిభ).

మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం సానికవరం గ్రామంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య స్మారక విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామ యువతలో విజ్ఞాన దాహాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక చైతన్యాన్ని విస్తరింపజేయాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మార్కాపురం డి.ఎస్.పి నాగరాజు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. యువత మంచి పుస్తకాలను చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పెద్దారవీడు సబ్ ఇన్‌స్పెక్టర్ సైదు బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని అన్నారు. శ్రావణి హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ మాట్లాడుతూ, విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా యువత అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో చైతన్యవంతమైన యువతే మార్పుకు నాంది పలుకుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.ం

## ప్రతిభతో నిలిచిన దివ్యాంగ విద్యార్థులకు ఘన సన్మానం






యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 19,(ప్రజా ప్రతిభ).

యర్రగొండపాలెం మండల ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ విద్యార్థులకు ఈరోజు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దిగుడు రమేష్, ఆవుల కస్తూరి అనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అందరి ప్రశంసలుఅందుకున్నారు. మార్కాపురం జిల్లా దివ్యాంగుల ఉద్యోగ సంఘం అధ్యక్షులు బుదాల చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభను కొనియాడుతూ శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ, “పట్టుదల, కృషి ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు. దివ్యాంగులు ఎవరికి తీసిపోరు. విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు” అని పేర్కొన్నారు. విద్యార్థులు మరింత ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, దివ్యాంగుల సంఘ సభ్యులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సన్మానం విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## చెంచు కాలనీల అభివృద్ధే లక్ష్యం

- జన్ భాగీదారి గ్రామసభలో అధికారుల హామీ.

యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 19,(ప్రజా ప్రతిభ).



మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలంలోని గుండంచెర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చెంచు కాలనీలలో ‘జన్ భాగీదారి’ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన గ్రామసభ ప్రజల్లో చైతన్యాన్ని నింపింది. గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు అధికారులు గ్రామసభలో పాల్గొని ప్రజలతో ముఖాముఖి మాట్లాడారు. ఎంపీడీవో జాన్ సుందరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చెంచు కాలనీల్లో తాగునీటి సౌకర్యం, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, ఆరోగ్య సేవలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామస్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెద్దారవీడు సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ చెంచు కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామసభలో అధికారులు ప్రజల సమస్యలను నమోదు చేసి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి శ్రీహర్ష, గ్రామ రెవెన్యూ అధికారి ఆదినారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha Telugu Daily
www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com
బుధవారం
మే 20, 2026

## బోప్పూరి వివాహ వేడుకలో కె.పి. నాగార్జున రెడ్డి..

**గిద్దలూరులో ఘనంగా జరిగిన రిసెప్షన్ కార్యక్రమం..**



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలెంకు చెందిన బోప్పూరి దీవెనమ్మ, చిన్న ప్రసాద్ దంపతుల కుమార్తె రాజకుమారి వివాహ రిసెప్షన్ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. వరుడు సునీల్‌తో జరిగిన ఈ వేడుకకు బంధుమిత్రులు, రాజకీయ నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మాజీ శాసనసభ్యుడు,గిద్దలూరు వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ కె.పి. నాగార్జున రెడ్డి పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. వధూవరులు ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. రిసెప్షన్ వేదికను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించగా వేడుక ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. అతిథులకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. వివాహ వేడుకకు వచ్చిన అతిథులను కుటుంబ సభ్యులు ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమం మొత్తం సందడి వాతావరణంలో కొనసాగింది.

## మహిళల నిర్ణయాల్లో ప్రభుత్వాల జోక్యం తగదు..

**పిల్లల విషయంలో మహిళలకే పూర్తి హక్కు..**

**చంద్రబాబు వ్యాఖ్యలపై కిరణ్ బేడీ అభ్యంతరం..**

**మహిళల ఆశయాలు, ఉద్యోగాల గురించి కూడా ఆలోచించాలని సూచన..**



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

మహిళలు ఎక్కువ మంది పిల్లలను కనాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలపై మాజీ ఐపీఎస్ అధికారి కిరణ్ బేడీ అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళల జీవితాలను కేవలం పిల్లల జననంతో మాత్రమే ముడిపెట్టకూడదని, వారి వ్యక్తిగత ఆశయాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు లక్ష్యాలను కూడా సమాజం గుర్తించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పిల్లలను కనడం అనేది పూర్తిగా మహిళల వ్యక్తిగత నిర్ణయమని పేర్కొన్న కిరణ్ బేడీ, ఈ విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం సరైంది కాదన్నారు. కుటుంబ వ్యవస్థ, ఆర్థిక పరిస్థితులు, ఆరోగ్య పరిస్థితులు, భవిష్యత్తు భద్రత వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి మహిళ తన నిర్ణయం తానే తీసుకోవాలని వ్యాఖ్యానించారు. మహిళలు ఇంటి బాధ్యతలు నిర్వర్తించడంతో పాటు ఉద్యోగాలు, కెరీర్, వ్యక్తిగత లక్ష్యాలను సాధించేందుకు ఇప్పటికే అనేక ఒత్తిడులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఎక్కువ మంది పిల్లలను కనాలని సూచించడం మహిళలపై అదనపు భారం మోపినట్టేనని అభిప్రాయపడ్డారు. మహిళల జీవితాలు కేవలం పిల్లల కోసమేనా? వారి కలలు, ఆశయాలు, ఉద్యోగాల పరిస్థితి ఏమిటి? ఇంటి పనులు, కుటుంబ బాధ్యతలతో పాటు వారు తమ లక్ష్యాలను ఎలా సాధించగలరు?' అంటూ కిరణ్ బేడీ ప్రశ్నించారు. మహిళల హక్కుల విషయంలో వారు మరింత చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇక పిల్లల పెంపకం విషయంలో కూడా తల్లిదండ్రులు బాధ్యతాయుతంగా ఆలోచించాలని సూచించారు. తాత్కాలిక ఆర్థిక ప్రోత్సాహకాల కోసం పిల్లలను కనడం కంటే, వారికి భవిష్యత్తులో సరైన పోషకాహారం, విద్య, ఆరోగ్యం అందించగలమా అనే అంశాలను ముందుగా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను కనడం ఒక పెద్ద బాధ్యత అని, ఆ బాధ్యతను సమర్థంగా నిర్వహించే సామర్థ్యం కుటుంబాలకు ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఈ అంశంపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. మహిళల స్వేచ్ఛ, కుటుంబ వ్యవస్థ, జనాభా విధానాలు, ప్రభుత్వ జోక్యం వంటి అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు మహిళల నిర్ణయాలను గౌరవించాల్సిందేనని అభిప్రాయపడుతుండగా, మరికొందరు జనాభా సమతౌల్యంపై ప్రభుత్వాలు ఆలోచించడం తప్పుకాదని వాదిస్తున్నారు. అయితే పిల్లల జననం, కుటుంబ పరిమాణం వంటి అంశాలు పూర్తిగా వ్యక్తిగత నిర్ణయాలేనని, సమాజం గానీ, ప్రభుత్వాలు గానీ ఒత్తిడి చేయరాదన్న అభిప్రాయం మహిళా సంఘాలు, సామాజికవేత్తల నుంచి వ్యక్తమవుతోంది.ద

## యర్రగొండపాలెంలో మిస్సింగ్ కేసు నమోదు

**వివాహానికి వెళ్లిన యువకుడు అదృశ్యం**

**యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 19,(ప్రజా ప్రతిభ).**

వివాహ వేడుకకు హాజరైన ఓ యువకుడు అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన యర్రగొండపాలెంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై ఎం. దేవకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దిగుడు ఆంజనేయులు (21) ఈ నెల 13న తమ చిన్నాన్న కుమార్తె వివాహానికి హాజరయ్యాడు. అనంతరం "సెంటర్‌కు వెళ్లి వస్తాను" అని తన అక్క, బావలకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు.కుటుంబ సభ్యులు, బంధువులు పలుచోట్ల గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందారు. చివరకు అతని బావ వెంకట్రావు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.ఆంజనేయులు గురించి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు కోరారు.



## భూ అక్రమాలపై పోలీసుల ఉక్కుపాదం..

**డబుల్ రిజిస్ట్రేషన్లు, దొంగ పత్రాలపై కఠిన చర్యలు..**

**దస్తావేజు లేఖర్లకు సీఐ ఘాటు హెచ్చరిక..**

**పారదర్శకంగా వ్యవహరించకపోతే కేసులు తప్పవని స్పష్టం..**

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురంలో రోజురోజుకు పెరుగుతున్న భూ వివాదాలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, నకిలీ పత్రాల వ్యవహారాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. అమాయక ప్రజలను మోసం చేస్తూ ఒకే భూమిని పలువురికి విక్రయించడం, తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు చేయించడం వంటి అక్రమాలను ఇకపై ఏమాత్రం సహించబోమని మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.డి.కె. అల్తాఫ్ హుస్సేన్ తీవ్రంగా హెచ్చరించారు. మంగళవారం మార్కాపురంలోని దస్తావేజు లేఖర్లు, డాక్యుమెంట్ రైటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భూ రిజిస్ట్రేషన్ వ్యవహారాలపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఇటీవల మార్కాపురం పరిధిలో భూముల కొనుగోలు, అమ్మకాల విషయంలో అనేక ఫిర్యాదులు పోలీసుల దృష్టికి వస్తున్నాయని తెలిపారు. ఒకే భూమిని పలువురికి విక్రయించడం, అసలైన యజమానులకు తెలియకుండా రహస్యంగా రిజిస్ట్రేషన్లు చేయించడం, నకిలీ పత్రాలతో మోసాలకు పాల్పడటం వంటి ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.డాక్యుమెంట్ రైటర్లు కేవలం పత్రాలు రాసే వ్యక్తులుగా కాకుండా చట్టపరమైన బాధ్యత కలిగిన వారిగా వ్యవహరించాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం, స్వార్థ ప్రయోజనాల కోసం చేసే పొరపాట్లు అనేక కుటుంబాలను రోడ్డున పడేస్తాయని అన్నారు. భూమి కొనుగోలు చేస్తున్న వ్యక్తి జీవితకాల పొదుపు మొత్తాన్ని పెట్టి స్థలం కొనుగోలు చేస్తుంటాడని, అలాంటి సందర్భాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం క్షమించరాని తప్పిదమని ఆగ్రహం వ్యక్తం చేశారు.రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రతి డాక్యుమెంట్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించడం తప్పనిసరి అని సీఐ స్పష్టం చేశారు. 1బి, అడంగల్, పట్టాదారు పాస్ పుస్తకం, ఈసీ, పాత రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ వివరాలు వంటి అన్ని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత మాత్రమే పత్రాలు సిద్ధం చేయాలని సూచించారు.ఎటువంటి అనుమానం వచ్చినా వెంటనే రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.నకిలీ పత్రాల తయారీ, ఫోర్జరీ సంతకాలు, తప్పుడు ఆధార్ కార్డులు, నకిలీ వారసత్వ ధ్రువపత్రాలతో భూముల రిజిస్ట్రేషన్లు జరిగితే సంబంధిత వ్యక్తులతో పాటు సహకరించిన వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ రిజిస్ట్రేషన్ల కారణంగా ఎన్నో కుటుంబాలు కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇకపై మార్కాపురం ప్రాంతంలో జరిగే ప్రతి కీలక భూ లావాదేవీపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత ఫిర్యాదులు వస్తే సంబంధిత డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తులు, భూమి విక్రేతలు అందరినీ విచారిస్తామని స్పష్టం చేశారు.అవసరమైతే అరెస్టులు కూడా తప్పవని హెచ్చరించారు.ప్రజలు కూడా భూములు కొనుగోలు చేసే ముందు పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించాలని, ఆకర్షణీయమైన ధరలకు మోసపోవద్దని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్లు జరిగితేనే భూ వివాదాలకు పూర్తిస్థాయిలో చెక్ పడుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎస్సై విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బంది, దస్తావేజు లేఖర్లు, డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు. సమావేశంలో పోలీసులు ఇచ్చిన హెచ్చరికలు దస్తావేజు లేఖర్లలో చర్చనీయాంశంగా మారాయి.




## ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులపై ప్రజల్లో ఆసక్తి..


**ఉచిత వైద్య భద్రత కోసం పెద్దఎత్తున నమోదు..**

**ఇంట్లో నుంచే సులభంగా హెల్త్ కార్డు పొందే అవకాశం..**




**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. ఉచిత వైద్య సేవల లక్ష్యంతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ పథకంలో భాగంగా ఏబీహెచ్ఏ హెల్త్ కార్డుల నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆధార్ ఆధారంగా సులభంగా నమోదు చేసుకునే విధానం ఉండటంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున నమోదు చేసుకుంటున్నారు.ఈ పథకం ద్వారా అర్హులైన వారికి ఐదు లక్షల రూపాయల వరకు ఆరోగ్య భీమా సౌకర్యం లభిస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు. కుటుంబ సభ్యుల వైద్య చికిత్స ఖర్చులను తగ్గించేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఈ కార్డు ద్వారా వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.హెల్త్ కార్డు నమోదు కోసం ఆధార్ నంబర్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం తప్పనిసరి. అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆధార్ నంబర్ నమోదు చేసిన తర్వాత ఓటీపీ ధృవీకరణ ప్రక్రియ పూర్తిచేస్తే కార్డు అందుబాటులోకి వస్తోంది. నమోదు పూర్తయ్యాక ఫోటోతో కూడిన డిజిటల్ హెల్త్ కార్డును వెంటనే డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించారు.ప్రస్తుతం వృద్ధులు, మధ్యతరగతి కుటుంబాలు, పేద ప్రజలు ఈ పథకం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.భవిష్యత్తులో వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు హెల్త్ కార్డులు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. పలుచోట్ల ప్రజలు తమ కుటుంబ సభ్యులకు కూడా కార్డులు నమోదు చేయిస్తున్నారు.ఆరోగ్య భద్రత ప్రతి కుటుంబానికి అవసరమని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువకులు, స్వచ్ఛంద కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియలో సహాయం చేస్తున్నారు. మొబైల్ ఫోన్ ద్వారానే కొద్ది నిమిషాల్లో కార్డు పొందే అవకాశం ఉండటంతో ప్రజలు సానుకూలంగా స్పందిస్తున్నారు.అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే నమోదు చేసుకోవాలని, వ్యక్తిగత వివరాలు తెలియని వ్యక్తులకు ఇవ్వవద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న వేదికల ద్వారా నమోదు చేసుకుంటే భద్రతతో పాటు పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని సూచిస్తున్నారు.




## జాతీయ రహదారులపై ఆక్రమణలకు చెక్..

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లాలోని జాతీయ రహదారులపై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఆక్రమణల తొలగింపుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రహదారులపై అక్రమ నిర్మాణాలు, అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్, రాత్రివేళల్లో పశువుల సంచారం వంటి కారణాలతో ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయసునీత అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారుల భద్రత కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న మూడు జాతీయ రహదారులపై సంయుక్త తనిఖీలు నిర్వహించి ప్రమాదాలకు కారణమవుతున్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని సంబంధిత శాఖలకు స్పష్టం చేశారు.జాతీయ రహదారుల వెంట వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేయడం ప్రమాదాలకు దారితీస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా హోటళ్లు, దుకాణాలు, పెట్రోల్ బంకుల వద్ద భారీ వాహనాలు రోడ్డు పక్కనే నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించా లని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లో జాతీయ రహదారులను ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ దుకాణాలు, షెడ్లు, తాత్కాలిక నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారుల కు సూచించారు. రహదారుల వెడల్పు తగ్గిపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.రాత్రి వేళల్లో జాతీయ రహదారులపై పశు వులను తోలుకెళ్లడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పశు వులను రహదారులపైకి తీసుకురాకుండా చూడాలని సూచించారు. ప్రమాదాల నివారణలో గ్రామస్థుల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు.జాతీయ రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి బ్లాక్‌స్పాట్లుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రవాణా, రెవెన్యూ, పోలీసు, జాతీయ రహదారుల శాఖలు కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని స్పష్టం చేశారు.ప్రమాదాలకు కారణమవుతున్న లోపాలను గుర్తించి వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులకు వైద్యసేవలు అందేలా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర సేవలు వేగంగా అందితే ప్రాణనష్టం తగ్గించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి రాంబాబు, జిల్లా రెవెన్యూ అధికారి శివరామరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బాలు నాయక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ప్రమాదాల నివారణకు సంయుక్త తనిఖీలు..**

**అడ్డదిడ్డంగా పార్కింగ్, అక్రమ దుకాణాలపై చర్యలకు ఆదేశాలు..**

**బ్లాక్‌స్పాట్ల గుర్తింపుపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం..**



# ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాపై పోలీసుల ఉక్కుపాదం..

## దోర్నాలలో నలుగురి అరెస్ట్..

## సెల్‌ఫోన్ల ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తింపు..

## నిందితుల వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం..





**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

దోర్నాల మండలంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్ల ద్వారా రహస్యంగా బెట్టింగ్ నిర్వహిస్తూ యువతను ఆకర్షిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దాడులు చేపట్టారు.దోర్నాల సీఐ అజయ్ కుమార్, ఎస్సై వెంకట రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సోమవారం రాత్రి పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు క్రికెట్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి బెట్టింగ్ నిర్వహణకు ఉపయోగిస్తున్న నాలుగు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లను ఆసరాగా చేసుకుని గ్రామాలు, పట్టణాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలు చురుగ్గా వ్యవహరిస్తున్నాయని పోలీసులు తెలిపారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని డబ్బుల ఆశ చూపిస్తూ అక్రమ కార్యకలాపాలకు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. కొందరు మొబైల్ యాప్‌లు, సోషల్ మీడియా గ్రూపుల ద్వారా బెట్టింగ్ నెట్వర్క్ నడుపుతున్నారని సమాచారం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.దోర్నాల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ అజయ్ కుమార్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చట్టవిరుద్ధంగా బెట్టింగ్ నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో చాలామంది అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.తల్లిదండ్రులు తమ పిల్లల మొబైల్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పదంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ నిర్వహించినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ఈ దాడుల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల దోపిడీ..?

## ఎమ్మార్పీకి మించి ధరలు వసూలు చేస్తున్న క్యాంటీన్ నిర్వాహకులు..

## ప్రశ్నించిన వారిపై దురుసు ప్రవర్తన ఆరోపణలు..

## స్టేషన్‌లో జరుగుతున్న వ్యవహారంపై ప్రయాణికుల ఆగ్రహం..




**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 19, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నుంచి ఎమ్మార్పీ కంటే అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్టేషన్‌లోని క్యాంటీన్‌లో నీటి బాటిళ్లు, కూల్‌డ్రింక్స్, బిస్కెట్లు, తినుబండారాలు వంటి వస్తువులను ఎమ్మార్పీ ధరల కంటే అదనంగా విక్రయిస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో వస్తువుపై రూ.5 నుంచి రూ.10 వరకు అధికంగా వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రైల్వే స్టేషన్ వంటి ప్రజా రద్దీ ప్రాంతంలో ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకొని అధిక ధరలు వసూలు చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక ధరలకు వస్తువులు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.స్టేషన్‌లో ఉన్న క్యాంటీన్ లైసెన్సు పొన్నెబోయిన భాగ్యలక్ష్మి పేరుతో 2024 జూలై 7 నుంచి 2029 జూలై 6 వరకు ఉన్నట్లు సమాచారం. అయితే ఎమ్మార్పీ ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించకపోవడం, ధరల విషయంలో పారదర్శకత లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రయాణికులు ధరల గురించి ప్రశ్నిస్తే సరైన సమాధానం ఇవ్వకుండా క్యాంటీన్ సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొంతమంది ప్రయాణికులు అధిక ధరల వసూళ్లపై ఫోటోలు, వీడియోలు తీయడానికి ప్రయత్నించగా వారిని అడ్డుకునే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో బెదిరింపులకు కూడా దిగుతున్నారని ప్రయాణికులు చెబుతున్నారు. దీంతో స్టేషన్‌లో అసలు పరిస్థితి ఏమిటన్నదిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారం స్టేషన్ అధికారులకు తెలిసే జరుగుతుందా, లేక వారి దృష్టికి రాకుండా కొనసాగుతుందా అన్న ప్రశ్నలు ప్రయాణికుల్లో వ్యక్తమవుతున్నాయి. రైల్వే స్టేషన్‌లో ఎమ్మార్పీకి మించి ధరలు వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధమని, అయినప్పటికీ చర్యలు లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రయాణికుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. క్యాంటీన్‌లో ధరల జాబితా తప్పనిసరిగా ప్రదర్శించేలా చూడాలని, ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజా సేవల కోసం ఉన్న రైల్వే స్టేషన్లు దోపిడీ కేంద్రాలుగా మారకూడదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రెక్కాడితే కానీ డొక్కాడని కడు నిరుపేద ఉపాధి







**పలమనేరు మే 19( ప్రజా ప్రతిభ).**

కూలీలను బలి తీసుకున్న ఫేస్ యాప్ నిబంధనను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా బహుజన సమాజ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.వి. మునిరత్నం, జిల్లా మహిళా అధ్యక్షురాలు సరస్వతి, జిల్లా యువజన అధ్యక్షులు సోమరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు తరిగొండ,మణి , గుర్రం, సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. అందులో భాగంగా మంగళవారం పలమనేర్ పట్టణంలో గల మానవ హక్కుల కార్యాలయం నందు అమనుల్లా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుటుంబాలను పోషించుకోవడానికి మరో మార్గం లేక మండుటెండను సైతం లెక్కచేయక ఉపాధి హామీ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని గుర్తు చేశారు. రెక్కల కష్టమే మాకు చాలంటూ నిజాయితీగా ఉపాధి పనులు చేసుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ఫేస్ యాప్ ను తీసుకురావడం దుర్మార్గమన్నారు. కూలీలు పనిచేసే చోట ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని నిబంధనతో అక్కడ ఫోన్ కు సిగ్నల్ రాకపోవడంతో పని ప్రదేశము నుండి పక్కకు వెళ్లిన వారిపైకి యమదూత రూపంలో టిప్పర్ దూసుకుపోవడంతో నలుగురు మహిళలు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల విబి గ్రామ్ జి ద్వారా ఉపాధి కూలీలు పనిచేసే చోట సెల్ ఫోనుకు సిగ్నల్ రాలేని ప్రాంతాలు ఉన్నప్పటికీ అతి కష్టంతో ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నారన్నారు. అనేకమంది సిగ్నల్ రాక పోవడంతో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పేస్ యాప్ ను పూర్తిస్థాయిలో అమలు చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల విధుల నిర్వహణలో భాగంగా మృతి చెందారని, అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించి ఒక్కొక్క కుటుంబానికి 50 లక్షల రూపాయలు పరిహారం, ఇంటికో ఉద్యోగం, 5 ఎకరాలు వ్యవసాయ భూమి, గాయపడిన వారికి మెరుగైన చికిత్సతోపాటు 10 లక్షలు పరిహారం అందించాలన్నారు. నిండు ప్రాణాలు కోల్పోతే న్యాయం కోసం నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు అడ్డుకోవడం సబబు కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నారాయణ శెట్టి, సూర శ్రీనివాసులు, ఆనంద్, మునస్వామి, గంగిరెడ్డి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.




### కోగిలేరు గ్రామంలో

# ఉచిత కంటి వైద్య శిబిరం




**పెద్దపంజాణి మే19( ప్రజా ప్రతిభ)**

పెద్దపంజాణి మండలం కోగిలేరు గ్రామంలో మంగళవారం డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు దళిత నాయకులు, సామాజిక సేవా కార్యకర్త కె. చిన్న ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో అనేకమంది కంటి జబ్బుల వలన ఇబ్బంది పడుతున్నారని సమాచారం మేరకు వారికి మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో డాక్టర్ అగర్వాల్ ఆస్పత్రి యాజమాన్యాన్ని సంప్రదించామన్నారు. తమ విజ్ఞప్తి మేరకు డాక్టర్ అగర్వాల్ యాజమాన్యం సానుకూలంగా స్పందించి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుకు అంగీకరించారన్నారు. ఈ నేపథ్యంలో కోగిలేరు గ్రామం నందు శిబిరం ఏర్పాటు చేయగా అందులో 60 మంది వివిధ కంటి వ్యాధుల తో బాధపడుతున్న బాధితులు హాజరయ్యారన్నారు. వారికి డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ పరీక్షల్లో కంటి ఆపరేషన్లు కోసం అర్హులైన వారిని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. కంటి ఆపరేషన్లకు వెళ్లే వారికి డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి యాజమాన్యం ఉచిత ఆపరేషన్తో పాటు, కంటి అద్దాలు, రవాణా సౌకర్యం ఆసుపత్రి వారు కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మణి, రాధా, మురుగేష్, గ్రామస్తులు పాల్గొన్నారు

# పెద్దపంజాణి సచివాలయంలో పాము హల్‌చల్ భయాందోళనకు గురైన సిబ్బంది

**పెద్దపంజాణి మే 19(ప్రజాప్రతిభ).**



పెద్దపంజాణి గ్రామ సచివాలయంలో మంగళవారం పాము హల్‌చల్ చేయడంతో సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలో హఠాత్తుగా ఓ పాము కార్యాలయంలోకి ప్రవేశించింది. దీంతో అక్కడ ఒక్కసారిగా కలకలం రేగింది.సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి పామును కొట్టి చంపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో కొంతసేపు సచివాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఇదిలా ఉండగా, గతంలో ఇదే సచివాలయంలో పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో సిబ్బంది గాయపడిన సంఘటన ఇంకా మరువకముందే, ఇప్పుడు పాము కార్యాలయంలోకి రావడం ఆందోళన కలిగిస్తోంది.కాగా, పెద్దపంజాణి గ్రామ సచివాలయం నూతన భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేదని స్థానికులు, సిబ్బంది విమర్శిస్తున్నారు. పాత భవనంలో సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ద

### కోగిలేరు గ్రామంలో

# కంటి వైద్య శిబిరం ఏర్పాటు




**పెద్దపంజాణి మే19 (ప్రజాప్రతిభ).**

పెద్దపంజాణి మండలంలోని కోగిలేరు గ్రామంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అగర్వాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 60 మందికి కంటి పరీక్షలు చేసి వైద్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా దళిత నాయకుడు, సామాజిక సేవా కార్యకర్త కే. చిన్న పాల్గొని శిబిరం నిర్వహణకు సహకరించారు. అలాగే బాలరాజు, అగర్వాల్ సిబ్బంది రాఘవేంద్ర, వీరాంజనేయులు, వెంకట్ రెడ్డి సమక్షంలో కార్యక్రమం జరిగింది.శిబిరంలో పాల్గొన్న ప్రజలకు కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మనీ, రాధా, మురుగేష్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మార్పు సంస్థ ఆధ్వర్యంలో

# ఆసుపత్రిలో ఉచిత భోజనం...

**వెంకటగిరి, మే 19(ప్రజా ప్రతిభ ):**



వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్ పేషంట్లకు ప్రతిరోజు మార్పు సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం అందించడం జరుగుతుంది. ఇందులో భాగం గా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న ఇన్ పేషంట్లకు మార్పు సంస్థ అధ్యక్షులు చిగురుపాటి పవన్, ఏపీయూ డబ్ల్యు జిల్లా కార్యదర్శి పల్లిపాటి జోసెఫ్ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా భోజనం అందించడం జరిగింది. ఈ సందర్బంగా పల్లిపాటి జోసెఫ్ మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు మధ్యాహ్నం భోజనం అందించడం గొప్ప విషయం అని తెలియజేశారు. మార్పు సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ అధ్యక్షులు చిగురుపాటి పవన్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha Telugu Daily
www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com
బుధవారం
మే 20, 2026

# చెరువుల సంరక్షణకే మొదటి ప్రాధాన్యత

## ఎంపీడీవో బాలాజీ




**పెద్దపంజాణి మే 19(ప్రజాప్రతిభ).**

పెద్దపంజాణి మండలంలో చెరువుల పరిరక్షణ మరియు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో బాలాజీ అధికారులను ఆదేశించారు. జల ధార -- జల హారతి కార్యక్రమాల అమలుపై పెద్దపంజాణి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ, చెరువుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. చెరువుల పరిరక్షణ కోసమే ప్రభుత్వం జలధార -- జల హారతి పనులను చేపడుతోందని పేర్కొన్నారు. ప్రతి చెరువుకు సంబంధించిన పూర్తి మ్యాప్‌తో పాటు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు.సమావేశంలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ మురుగేషన్, జూనియర్ ఇంజనీర్ సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.అనంతరం తుర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులను ఎంపీడీవో బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్ కుమార్ పరిశీలించారు. అలాగే కొలతూరు, పెదకాపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులను ఉపాధి హామీ ఏపీఓ మురుగేషన్ పరిశీలించి పనుల పురోగతిపై వివరాలు సేకరించారు.

# మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే కురుగొండ్ల...







**వెంకటగిరి, మే 19(ప్రజా ప్రతిభ ):**

మత్స్యకారుల సంక్షేమం,వారి జీవనోపాధి అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వెంకటగిరి ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. సముద్ర వేట విరామ సమయంలో మత్స్యకారులకు అందించే “మృత్స్య కార సేవలో ” ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుండి రూ.20 వేలకు పెంచి నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం ద్వారా ప్రభుత్వం మత్స్యకార కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు.ఈ విప్లవాత్మక నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.3 లక్షల మంది మత్స్యకార కుటుంబాలకు భారీ స్థాయిలో లబ్ధి చేకూరుతుందని ఆయన అన్నారు.తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన “మత్స్యకారులకు సేవలో” కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ,మత్స్యశాఖ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు , సహచర శాసన సభ్యులతో కలిసి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, జీవనోపాధి అవకాశాల విస్తరణ మరియు ప్రభుత్వ సేవలను గ్రామస్థాయికి చేరవేయడం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు.అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్ , ఎస్పీ సుబ్బారాయుడు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి కూటమి ప్రభుత్వం అందించిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి ఎమ్మెల్యేలు, జిల్లా అధికార యంత్రాంగం, మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అల్ ఇండియా మెడికల్ షాప్స్ బంద్

## గూడూరు మెడికల్ అసోసియేషన్ మద్దతు.



**నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):**

దేశవ్యాప్తంగా రేపు నిర్వహించనున్న అల్ ఇండియా మెడికల్ షాప్స్ బంద్‌కు మద్దతుగా గూడూరు మెడికల్ అసోసియేషన్ సభ్యులు ముందస్తుగా అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా గూడూరు ఆర్డీవో (ఆర్ డి ఓ) ని కలిసి బంద్‌కు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ వినతి పత్రం సమర్పించారు. అలాగే గూడూరు డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో, వారి కార్యాలయంలో సీసీ కి మరో వినతి పత్రాన్ని అందించారు.దేశవ్యాప్తంగా మెడికల్ రంగానికి సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. రేపు జరిగే బంద్‌కు గూడూరు ప్రాంతంలోని మెడికల్ షాపుల యజమానులు, ఫార్మసీ వ్యాపారులు పూర్తి సహకారం అందించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గూడూరు మెడికల్ అసోసియేషన్ సభ్యులు సుభాన్, బత్తిన సుధాకర్, దయాకర్, చి. వెంకటేష్, కృష్ణ ప్రసాద్, చంద్రమౌళి, ఎస్కే, సందానిబాషా, మురళీ యాదవ్, సాయి శ్రీనివాసరావు, గుణశేఖర్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన వర్గాలకు ఉచిత విద్యుత్ పథకం

## అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి : ఎంపీడీవో



**పెద్దపంజాణి మే 19(ప్రజాప్రతిభ)**

పెద్దపంజాని మండలంలోని వెనుకబడిన వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో ) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.మండల పరిధిలోని రజక, స్వర్ణకార, నాయీ బ్రాహ్మణ మరియు అత్యంత వెనుకబడిన వర్గాల (ఎంబిసి ) లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.పథకం ప్రకారం రజక/చాకలి వర్గాలకు లాండ్రీ షాపు కలిగి ఉంటే నెలకు 150 యూనిట్ల వరకు, స్వర్ణకార/విశ్వబ్రాహ్మణ వర్గాలకు స్వర్ణకార షాపు ఉంటే నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు. అలాగే నాయీ బ్రాహ్మణ వర్గాలకు హెయిర్ కటింగ్ సెలూన్ షాపు ఉన్నట్లయితే నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించనున్నారు.అత్యంత వెనుకబడిన వర్గాల (ఎంబిసి ) పేదరిక రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు నెలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు తెలిపారు.ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, ప్రస్తుత విద్యుత్ బిల్లు లేదా సర్వీస్ నంబర్‌తో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఫారం-సి) సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఎం.బి.సి వర్గాలకు ఫారం-సి అవసరం లేదన్నారు.అర్హులైన లబ్ధిదారులు తమ పరిధిలోని ఏపీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ ) కార్యాలయం లేదా గ్రామ/వార్డు సచివాలయాలను సంప్రదించి వెంటనే దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని వినియోగించుకోవాలని ఎంపీడీవో కోరారు.

# సముద్ర చేపల వేట నిషేధ భృతి పంపిణీ

## ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్




**నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):**

తిరుపతి జిల్లా రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న సముద్ర చేపల వేట నిషేధ భృతి పంపిణీ కార్యక్రమంలో భాగంగా తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మత్స్యకార సేవ కార్యక్రమంలో గూడూరు శాసన సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమం రాష్ట్ర ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో మత్స్యకారుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించగా, సముద్ర చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అందిస్తున్న భృతి ఎంతో ఉపయోగకరమని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ పాశిం సునీల్ కుమార్ మాట్లాడుతూ, మత్స్యకారుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సముద్ర వేట నిషేధ కాలంలో ఉపాధి కోల్పోయే మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సదుపాయాలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# గూడూరులో పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై వైసీపీ నిరసన

**నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గూడూరులో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. క్లోక్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్ ప్రధాన నేతృత్వం వహించగా, ముఖ్య అతిథులుగా సీ.ఈ.సీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ఎస్.ఈ.సి సభ్యులు కొడవలూరు భక్తవత్సల్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మెరిగ మురళీధర్ మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం ఇంధన ధరలను పెంచుతూ ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు, ఆటో మరియు రవాణా రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా ప్రస్తుతం ధరలను పెంచడం ప్రజలను మోసం చేయడమేనని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న అదనపు పన్నులను వెంటనే పునఃసమీక్షించి, పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే ధరల పెరుగుదల వల్ల ప్రజలపై పడుతున్న అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు.ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి పెరిగిన ఇంధన ధరలను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజల తరఫున మరింత విస్తృత స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, అన్ని మండలాల అధ్యక్షులు, గూడూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు మరియు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితులను మోసం చేసింది గత వైసీపీ ప్రభుత్వమే

## ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

**నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):**



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన ఘటనలు రాష్ట్ర చరిత్రలో మచ్చగా నిలిచిపోయాయని గూడూరు శాసన సభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీ పాశిం సునీల్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మీడియాతో మాట్లాడుతూ ఆయన గత ప్రభుత్వంపై పలు ఆరోపణలు చేశారు.దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొన్న అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోకుండా, అతడిని వెంటేసుకుని తిరిగారని ఆరోపించారు. తాడిపత్రిలో ఓ దళిత సీఐను కులం పేరుతో అవమానించి, మానసిక వేధింపులకు గురిచేసి బలవన్మరణానికి కారణమయ్యారని విమర్శించారు.కోడికత్తి ఘటనలో దళిత యువకుడు జనుపల్లి శ్రీనివాస్‌ను ఐదేళ్ల పాటు జైలులో మగ్గబెట్టి అతని కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ప్రశాంతంగా ఉన్న కోనసీమ జిల్లాలో కుల విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేశారని, అంబేద్కర్ పేరు అంశాన్ని వివాదాస్పదంగా మార్చి కులాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నించారని విమర్శించారు.కరోనా సమయంలో మాస్కులు అడిగినందుకు దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను రోడ్డుపై అవమానించి, పోలీసులు లాఠీలతో కొట్టించారని, అనంతరం మానసిక ఆస్పత్రికి తరలించి చివరకు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.చిత్తూరు జిల్లాలో ఓం ప్రతాప్ అనే వ్యక్తి నాణ్యతలేని మద్యం విక్రయాలపై ప్రశ్నించిన మరుసటి రోజే అనుమానాస్పదంగా మరణించాడని, అక్రమ ఇసుక దందాను ప్రశ్నించిన వరప్రసాద్ అనే వ్యక్తిని శిరోముండనం చేసి అవమానించారని ఆరోపించారు.

డా. అచ్చెన్న అనే వెటర్నరీ అధికారిని కులం పేరుతో వేధింపులకు గురిచేసి హత్య చేశారని, దళిత మహిళలపై దాడులు, అత్యాచారాల కేసుల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందువరుసలో ఉందని ఎన్‌సీఆర్‌బీ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన దళిత యువతి అనూషపై అత్యాచారం చేసి హత్య చేశారని, పులివెందులలో నాగమ్మ అనే దళిత మహిళపై అత్యాచారం, హత్య జరిగినా కనీసం పరామర్శించడానికి కూడా వెళ్లలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన టీడీపీ దళిత నాయకులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అనంతపురం జిల్లా ధర్మవరంకు చెందిన జాతీయ స్థాయి జూనియర్ క్రీడాకారిణి స్నేహలతపై అత్యాచారం చేసి హత్య చేశారని, దళితుల భద్రత విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.ఎన్నికల సమయంలో మాత్రమే దళితుల సంక్షేమం గుర్తుకు వస్తుందని, ఓట్ల కోసం దళితులను ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. గత ఐదేళ్లలో దళితులపై చూపించింది కేవలం కపట ప్రేమ మాత్రమేనని డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు.

# తుమ్మలపెంటలో మత్స్యకార సేవలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

## మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ.

నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):



తీర గ్రామాల రూపురేఖలు మార్చే నిర్ణయాలు

నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మలపెంటకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు మత్స్యకార సేవలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ముఖ్యమంత్రికి మంత్రులు ఎండీ ఫరూక్, ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి, టీడీపీ రీజినల్ కోఆర్డినేటర్ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు ఘన స్వాగతం పలికారు.ప్రజా వేదికలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మత్స్యకారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, "మనసుకు ఎంతో దగ్గరైన తుమ్మలపెంట గ్రామానికి రావడం ఆనందంగా ఉంది" అన్నారు. సముద్రాన్ని నమ్ముకుని జీవించే మత్స్యకారులు ఎంతో ధైర్యసాహసాలు కలిగినవారని, ప్రమాదాలను ఎదుర్కొంటూ కష్టపడి జీవనం సాగిస్తున్నారని కొనియాడారు.ఏప్రిల్ 15 నుంచి 61 రోజుల పాటు చేపల సంతానోత్పత్తి కాలం కావడంతో సముద్ర వేట నిషేధం అమలులో ఉంటుందని, ఈ సమయంలో ఆదాయం లేక ఇబ్బందులు పడే మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార భరోసా మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు.మత్స్యకారుల సంక్షేమం గురించి మొదటగా ఆలోచించిన నాయకుడు ఎన్. టి. రామరావు అని గుర్తు చేసిన సీఎం, అనంతరం తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 33 కిలోల బియ్యం అందించామని, తుఫాను సమయంలో 50 కిలోల బియ్యం పంపిణీ చేశామని తెలిపారు. గతంలో రూ.2 వేలుగా ఉన్న సహాయాన్ని రూ.4 వేలకు, ప్రస్తుతం రూ.20 వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సుదీర్ఘ సముద్ర తీరం రాష్ట్రానికి గొప్ప వరమని, వ్యవసాయం మరియు నిర్మాణ రంగాల తర్వాత అత్యధికంగా ప్రజలు మత్స్య వేటపై ఆధారపడుతున్నారని చెప్పారు. మత్స్యకారులను పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మెకనైజ్డ్ పడవలకు భారీ సబ్సిడీలు అందిస్తున్నామని, కోట్ల రూపాయలతో ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు."ఈ సముద్రం మనది... చేపలు మనవి... వేట మనదే" అంటూ మత్స్యకారుల్లో ఉత్సాహం నింపిన సీఎం, ఇతర ప్రాంతాల వారు ఇక్కడ అక్రమంగా వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుకు ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. వీటిపై 60 శాతం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు.చేపల వేటతో పాటు సముద్ర నాచు పెంపకం ద్వారా కూడా మత్స్యకారులు అధిక ఆదాయం పొందవచ్చని సూచించారు. సాంకేతికత వినియోగంతో ఉపగ్రహాల ద్వారా సముద్రంలో చేపల వనరులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకుని మరింత సమర్థవంతంగా వేట సాగించే అవకాశం ఉందన్నారు.ఆక్వా రైతులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, రాయలసీమ ప్రాంతాన్ని డిఫెన్స్, స్పేస్, ఆగ్రో పరిశ్రమలకు హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. తిరుపతి వద్ద బుల్లెట్ తయారీ సంస్థ ఏర్పాటైందని, 18 నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని వెల్లడించారు. అలాగే సాగర్ డిఫెన్స్ పరిశ్రమ ద్వారా అనేక ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.ప్రభుత్వం బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని, వాట్సాప్ గవర్నెన్స్, రైతు మిత్ర వంటి వినూత్న పాలన అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకారులతో పాటు మగ్గం కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్, నాయీబ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వివరించారు.ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, బీసీల ఐక్యత కోసం కృషి చేస్తామని, బీసీల రుణ భారం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తుమ్మలపెంటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రామాయపట్నం పోర్టు పనులు పూర్తి చేసి అభివృద్ధికి కొత్త దారులు తీసుకువస్తామని పేర్కొన్నారు.గత 50 రోజుల్లోనే నెల్లూరు జిల్లాకు రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించిన సీఎం, కావలి ఎమ్మెల్యే అడిగిన మూడు అభివృద్ధి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఆయిల్, ఎరువులు, గ్యాస్ ధరలు పెరుగుతున్నాయని పేర్కొంటూ ప్రజలు అనవసర ప్రయాణాలు తగ్గించాలని, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, విదేశీ టూరిజాన్ని రాష్ట్రానికి ఆకర్షించేందుకు బీచ్‌ల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.రాష్ట్రంలో అభివృద్ధి, సూపర్ సిక్స్ పథకాలు చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని, తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. "గొడ్డలి రాజకీయాలు రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్తాయి... మంచి పాలన రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తుంది" అని వ్యాఖ్యానించారు.చివరగా నెల్లూరు జిల్లా కలెక్టర్ పనితీరును ప్రత్యేకంగా అభినందించిన ముఖ్యమంత్రి, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

# తమ్మినపట్నం మత్స్యకారులకు రూ.1.08 కోట్లు

## సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పాలాభిషేకాలతో కృతజ్ఞతలు.



నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):

తమ్మినపట్నం పంచాయతీలో మత్స్యకారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. మత్స్యకారుల సేవ పథకంలో భాగంగా రెండో విడతగా 541 మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.1 కోటి 8 లక్షల ఆర్థిక సహాయం విడుదలైంది.ఈ సందర్భంగా తమ్మినపట్నం మత్స్యకారులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్లకు పాలాభిషేకాలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువత అధికార ప్రతినిధి కోట సతీష్ యాదవ్, తిరుపతి పార్లమెంట్ మత్స్యకార ఉపాధ్యక్షుడు బక్తాని రామయ్య, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు కొలంగారి సుబ్రహ్మణ్యం, గ్రామ బీసీ సెల్ అధ్యక్షుడు నాగూర్ బాబు, కొప్పాల సుబ్రహ్మణ్యం, నాగరాజు, లక్ష్మయ్య, దాసయ్య, మావిల శివ, మొలకయ్య, ఖాదర్ బాషా, మౌల తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బడి పిలుస్తుంది



వాకాడు మే 19 ప్రజా ప్రతిభ

తిరుపతి జిల్లా వాకాడు :మండలం పరిధిలోని వాకాడు గ్రామం నందు మంగళవారం బడి పిలుస్తోంది ప్రచార రథాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ ప్రారంభించారు. 22వ రోజు వాకాడు నందు బడి పిలుస్తోంది కార్యక్రమానికి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు, అలాగే మండలం నందు పదవ తరగతి నందు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన సన్మానించారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ, మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమం నందు జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల నందు ఉచితం గా సర్వేపల్లి రాధాకృష్ణ కిట్ నందు యూనిఫాం,బూట్లు,పాఠ్యపుస్తకాలు,విశాలమైన తరగతి గదులు , ప్రతి తరగతి నందు ఐఎఫ్పి ప్యానెల్ ద్వారా విద్యను అందిస్తున్నారని , ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎఫ్ ఎల్ ఎన్ టి ఏ ఆర్, ఎల్ ఫ్లై కార్యక్రమాలు,మధ్యాహ్న భోజన పథకంను , లీప్ యాప్ యొక్క ఉపయోగాలను తెలియజేయడం జరిగినది . జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ప్రవేట్ పాఠశాల నుండి పదిహేను మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో నూతనం గా చేరడం జరిగినది, అనంతరం బాలి రెడ్డి పాలెం, వాలమేడు, తుపిలిపాలెం, కొం దూరు, దుగరాజపట్నం, రావిగుంటపాలెం మూల పడవ, శ్రీహరిపురం, రాయ దొరువు, తిరుమూరు ఇతర గ్రామాలలో ప్రచార రథం పర్యటించినది ఈ కార్యక్రమం నందు సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, వాకాడు మండల అభివృద్ధి అధికారి శ్రీ సాయి ప్రసాద్ గారు, మండల విద్యాశాఖ అధికారులు విజయ్ కుమార్ గ, నసీం ఆలీ ,మండల టిడిపి నాయకులు మధు రెడ్డి , మండల కృష్ణమూర్తి , టిడిపి నాయకులు రామలింగారెడ్డి దినకర్ బాబు , ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# అధిక లోడుతో తిరుగుతున్న టిప్పర్లపై జనసేన ఫిర్యాదు

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్.

నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):

పరిమితికి మించి అధిక లోడ్లతో తిరుగుతున్న టిప్పర్ లారీల కారణంగా గ్రామీణ ఆర్ ‌ఀ బి రహదారులు తీవ్రంగా దెబ్బతింటున్నాయని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్లతో నడుస్తున్న టిప్పర్ లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం గూడూరు రవాణా శాఖ అధికారిని కలిసి జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా తీగల చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ, వెందోడు, భువనగిరిపాలెం ప్రాంతాల్లోని క్వారీలు, క్రషర్ల నుంచి కొండాగుంట, వెంకటేశ్వరపల్లి, కాంద్ర, పారిచెర్ల, గాంధీనగర్ మీదుగా కుందకూరు, సైదాపురం ప్రాంతాల వరకు అధిక లోడ్లతో టిప్పర్లు నడుస్తున్నాయని తెలిపారు. అలాగే గొల్లపల్లి, కొమ్మనేటూరు, తిప్పవరపాడు, చెన్నూరు గ్రామాల మీదుగా కూడా నిబంధనలకు విరుద్ధంగా మితిమీరిన వేగంతో టిప్పర్లు సంచరిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ వాహనాలు పరిమితికి మించి లోడ్లు మోసుకెళ్లడం వల్ల రహదారులు గుంతలు పడటం, పగుళ్లు ఏర్పడటం జరుగుతోందని అన్నారు. టిప్పర్లపై రక్షణ నెట్‌లు ఏర్పాటు చేయకపోవడం, అతివేగంగా నడపడం వల్ల కంకర రాళ్లు రోడ్లపై పడిపడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా తక్షణమే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అధిక లోడ్ వాహనాల రాకపోకలను నియంత్రించాలని అధికారులను కోరారు.ఫిర్యాదుపై స్పందించిన ఆర్టీఓ అధికారి కిషోర్, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న టిప్పర్ లారీలపై చర్యలు తీసుకోవాలని బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు సునీల్, శాంతిలకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పీఓసీ కే. మోహన్, గుంటమడుగు నవీన్ రాజు, ఉప్పు సాయి కిరణ్, పారిచెర్ల శ్రీనివాసులు, అనిల్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.



# క్రిస్ సిటీ భూ సమస్యలపై సమగ్ర విచారణ జరపాలి

## రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ డిమాండ్.

నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):




గూడూరు పట్టణంలో రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ సంయుక్తంగా క్రిస్ సిటీ భూ సమస్యలపై నిజ నిర్ధారణ కమిటీ సమావేశం నిర్వహించింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ. రామానాయుడు మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రిస్ సిటీ పేరుతో దాదాపు 1300 ఎకరాల భూమి సేకరణ జరుగుతోందని తెలిపారు. నాలుగు తరాలుగా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూముల్లో జీడి, మామిడి, జామ్ ఆయిల్, సవక, వేరుశనగ వంటి పంటలు సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా వందల సంఖ్యలో ఉన్న తాటి చెట్లపై ఆధారపడి గీత కార్మికులు జీవిస్తున్నారని చెప్పారు.చిల్లకూరు మండలంలోని పల్లెవారి దిబ్బ, తీగలపాలెం, తమ్మినపట్నం గ్రామాలకు చెందిన వందలాది కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. సేకరించిన భూముల్లో సుమారు 900 ఎకరాలు తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఉన్నాయని, అందులో కొంతభాగానికే పరిహారం చెల్లించబడిందని అన్నారు. మిగిలిన భూములకు పరిహారం చెల్లింపుల విషయంలో స్పష్టత రావాల్సి ఉందన్నారు.గ్రామస్థులు జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు భూములను పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారని చెప్పారు.తమ్మినపట్నం గ్రామంలోని 291 సర్వే నంబరులోని భూముల విషయంలో స్పష్టత తీసుకురావాలని, భూముల యాజమాన్యంపై పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. భూ సేకరణ ప్రక్రియలో పారదర్శకత పాటించి, బాధిత రైతులు, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూములు కోల్పోయే పేదలకు తగిన పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్. ప్రభాకర్, నెల్లూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు షేక్ షాన్ వాజ్, సీపీఐ గూడూరు నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కొమ్మి నారాయణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన విజయవంతం చేసిన అందరికి అభినందనలు..

## జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లా బ్యూరో మే 19(ప్రజా ప్రతిభ):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతంగా నిర్వహించిన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు విభాగం సిబ్బంది, మీడియా ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయడంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ముఖ్యమంత్రి తుమ్మలపెంట పర్యటన సజావుగా పూర్తయిందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను విస్తృతంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించిందని ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఇదే ఉత్సాహం, నిబద్ధతతో భవిష్యత్‌లో కూడా అత్యంత ప్రముఖులు, ప్రముఖుల పర్యటనలను,



ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు..

## రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని

# పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు

గొలుగొండ, మే 19 (ప్రజా ప్రతిభ)

ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని గొలుగొండ పోలీస్ స్టేషన్లో పోలీస్ సిబ్బందికి మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు.గొలుగొండ వైద్యులు డాక్టర్ శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందికి రక్తపోటు పరీక్షలు చేసి ఆరోగ్య సూచనలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ రక్తపోటును నిర్లక్ష్యం చేయకుండా తరచూ పరీక్షలు చేయించుకోవాలని, సమయానికి చికిత్స తీసుకోవడం ద్వారా గుండె సంబంధిత వ్యాధులను నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



# నక్కపల్లిలో మెగా జాబ్ మేళా విజయవంతం

**- 2000 ఖాళీలకు 55 మంది ఎంపిక**

**నిరుద్యోగ యువతకు నైపుణ్యమే మార్గం: కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్**






**నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నక్కపల్లిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి ఆశయం మేరకు రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఈ సంవత్సరంలో మన నియోజకవర్గంలో ఇది మూడో మెగా జాబ్ మేళా. నైపుణ్య శిక్షణ ద్వారా యువతను ఉద్యోగాలకు సిద్ధం చేసి, నేరుగా కంపెనీల వద్దకు తీసుకెళ్లే బాధ్యతను నైపుణ్యాభివృద్ధి సంస్థ తీసుకుంది. నేటి పోటీ ప్రపంచంలో కేవలం డిగ్రీలు ఉంటే సరిపోదు, నైపుణ్యం ఉంటేనే ఉద్యోగం. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలి. రాబోయే రోజుల్లో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం" అని అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. గోవిందరావు మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో సుమారు 15 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొని 2000 ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చాయని తెలిపారు. మొత్తం 105 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, వారిలో 55 మంది వివిధ కంపెనీలకు ప్రాథమికంగా ఎంపికయ్యారు. ఎంపికైన వారికి త్వరలోనే నియామక పత్రాలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి. శ్రీలక్ష్మి, నక్కపల్లి మండల టీడీపీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, అనకాపల్లి జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పి. శ్రీనివాసరావు, వివిధ కంపెనీల హెచ్ఆర్ ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజయ్యపేటలో ఉపాధి హామీ

# పనుల్లో సైబర్ మోసం కలకలం

**- జూమ్‌కాల్‌తో బయటి వ్యక్తులకు మస్టర్లు..!**

**గ్రామ కూలీలకు పని ఎగ్గొట్టి ఇతర ప్రాంతాల వారికి మస్టర్లు -- వీఆర్పీపై గ్రామస్తుల ఆగ్రహం, ఎంపీడీవోకు వినతి**



**నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ)**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది. గ్రామంలోని 70 ఉపాధి గ్రూపులకు 70 మంది మేట్లు ఉండగా, గ్రామ విఆర్పీ మైలపల్లి సత్యనారాయణ గ్రామస్తులను కాదని ఇతర ప్రాంతాల వ్యక్తులకు మస్టర్లు వేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో దాదాపు 1400 మంది శ్రామికులు పనుల్లేక ఇబ్బంది పడుతుండగా, బోయపాడు సహా ఇతర ప్రాంతాల వారికి ఆన్‌లైన్ జూమ్ కాల్ ద్వారా హాజరు వేసి వేతనాలు దోచుకుంటున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. మేట్ల ద్వారా స్థానికేతరులకు మస్టర్లు నమోదు చేస్తుండటంపై కూలీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "గ్రామంలో పనిచేసే కూలీలకు పని లేదని చెప్పి, బయటి వారికి జూమ్‌లో మస్టర్లు వేయడం అన్యాయం. ఇలాంటి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి" అని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నక్కపల్లి మండల ఎంపీడీవో సీతారామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంది గురన్న, గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), పిక్కి చిన్నారి, పిక్కి కిరణ్, బొందలపు అప్పలరాజు, పిక్కి కోటేశ్వరరావు, మైలిపల్లి రాము, ఏరిపల్లి అమ్మోరియా, పిక్కి రమణ, పిక్కి కాశిరావు తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకంలో పారదర్శకత లోపించిందని, బాధ్యులపై విచారణ జరిపి నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మండల కార్యాలయానికి

# చేరుకున్న చెత్త సేకరణ రిక్షా బండ్లు

**నాతవరం, మే,19,(ప్రజా ప్రతిభ)**




స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా మంగళవారం నాతవరం మండల పరిషత్ కార్యాలయం కు పొడి చెత్త తడి చెత్త సేకరించేందుకు మూడు చక్రాల రిక్షా బండ్లు వచ్చేయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం, సత్య శ్రీనివాస్ అన్నారు గతంలో మేజర్ పంచాయితీలకు ట్రాక్టర్లు మంజూరు కాగా మిగిలిన చిన్న పంచాయతీలకు మూడు చక్రాల రిక్షా బండ్లు మంజూరయ్యాయని ఈ రిక్షాల ద్వారా తడి చెత్త పొడి చెత్త చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తారని ఆయన అన్నారు వీటిని ఆయా పంచాయతీలకు అందజేస్తామని అన్నారు

## రాజయ్యపేట ఆర్‌అండ్‌ఆర్

# ప్యాకేజీలో భారీ అవినీతి..

**విచారణకు కలెక్టర్‌కు వినతి**

**తప్పుడు పత్రాలతో 21 మంది అనర్హులకు ప్యాకేజీ.. అసలైన లబ్ధిదారులకు అన్యాయం**

**బల్క్ డ్రగ్ పార్కుకు భూములివ్వడానికి రైతులు వెనుకంజ వేస్తారని ఆందోళన**







**నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ) :**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, నాయకులు జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణనన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

**అసలేం జరిగింది..?**

2014లో ఏపీఐఐసీ ద్వారా రాజయ్యపేట రెవెన్యూ పరిధిలో 861 ఎకరాల భూమిని సేకరించారు. జిరాయితీ భూముల్లో ఇళ్లు కోల్పోయిన 104 కుటుంబాలను అర్హులుగా గుర్తించి నష్టపరిహారం చెల్లించారు. అయితే గ్రామంలోని కొందరు వ్యక్తులు నాయకుల అండతో తప్పుడు పత్రాలు సృష్టించి తాము కూడా ఇళ్లు కోల్పోయామంటూ 21 మంది అక్రమంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ లబ్ధిదారులుగా చేరారని గ్రామస్తులు ఆరోపించారు. ఇదే బాటలో మరికొందరు కూడా అనర్హుల జాబితాలో ఉన్నారని తెలిపారు.

**నిజమైన లబ్ధిదారులకు అన్యాయం**

అనర్హులకు ప్యాకేజీలు ఇవ్వడం వల్ల నిజమైన లబ్ధిదారులకు నష్టపరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

**బల్క్ డ్రగ్ పార్కుపై ప్రభావం**

ఇలాంటి అవినీతి కొనసాగితే రానున్న రోజుల్లో బల్క్ డ్రగ్ పార్కు కోసం భూములిచ్చేందుకు రైతులు వెనకాడే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2014 భూసేకరణలోనూ అవినీతి జరిగిందన్న విమర్శలు ఉన్నాయని, ఇలాగే కొనసాగితే ప్రభుత్వంపై, అధికారులపై ప్రజలకు నమ్మకం పోతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

**వినతి పత్రం సమర్పించిన వారిలో..**

జనసేన పార్టీ నక్కపల్లి మండల ప్రధాన కార్యదర్శి బొంది గుర్రన్న, గ్రామశాఖ అధ్యక్షుడు పిక్కి కోదండరావు (బుజ్జి), ఉపాధ్యక్షుడు వాసుపల్లి నూకరాజు, నాయకులు పిక్కి చిన్నారి, పిక్కి కోటి, పిక్కి రాము, మైలపల్లి రాము, పిక్కి కోటేశ్వరరావు, మైలపల్లి అమ్మోరి తదితరులు పాల్గొన్నారు.

## హెటిరో ఒప్పందం మేరకు 200 రేషన్

# కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించాలి

## గ్రామస్తుల వినతి



**నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ) :**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో నాలుగేళ్ల క్రితం హెటిరో కంపెనీపై జరిగిన ధర్నా సందర్భంగా కుదిరిన ఒప్పందం ప్రకారం నిత్యావసర సరుకులను 2600 రేషన్ కార్డుదారులందరికీ అందించాలని గ్రామ పెద్దలు, యువత డిమాండ్ చేశారు. ఒప్పందం మేరకు ప్రతి ఏటా అందించాల్సిన నిత్యావసర సరుకులను కంపెనీ ఇవ్వకపోవడంతో విషయాన్ని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి అనిత హెటిరో కంపెనీ యాజమాన్యంతో, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి గ్రామానికి రావాల్సిన సరుకులను తక్షణమే పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో స్పందించిన హెటిరో సంస్థ గత రెండు, మూడు రోజులుగా గ్రామంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టింది. అయితే మొత్తం 2600 రేషన్ కార్డులకుగాను 2400 కార్డుదారులకు మాత్రమే సరుకులు అందించింది. మిగిలిన 200 రైస్ కార్డుదారులకు కూడా వెంటనే సరుకులు అందించాలని కోరుతూ మంగళవారం గ్రామ పెద్దలు, యువకులు ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీక్కి స్వామి, ఏరిపల్లి నాగేష్, చొక్కా కాశి, కారే వెంకటేష్, పీక్కి కాశి, జామి అప్పలరాజు, పీక్కి అప్పలరాజు, గంగిరి రాజు, వాసపల్లి గుర్రయ్య, వాసపల్లి అప్పలరాజు, కందాల నూకరాజు, కుందేటి శ్రీను, ఎజ్జల కోటయ్య, అర్జిల్లి మాధవ, పీక్కి కోటి, పీక్కి కోర్లయ, మద్దు కనకరాజు, మద్దు జోగిరాజు, మద్దు జగన్నాథం, మద్దు తాతలు, బొగడ వెంకన్న, మద్దు బంగారి తదితరులు పాల్గొన్నారు. ఒప్పందం ప్రకారం అర్హులైన అందరికీ న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## మలేషియాలో తెలుగు తేజం - ప్రపంచ యోగా

# పోటీల్లో 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్'గా దేవాన్ష్ నాయుడు

**నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ) :**






మలేషియా రాజధాని కౌలాలంపూర్ వేదికగా ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన 11వ ప్రపంచ యోగా పోటీల్లో విశాఖకు చెందిన విద్యార్థి బండారు దేవాన్ష్ నాయుడు సత్తా చాటాడు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో 10వ తరగతి చదువుతున్న దేవాన్ష్ నాయుడు ట్రెడిషనల్ యోగా, ఆర్టిస్టిక్ యోగా విభాగాల్లో ప్రథమ స్థానం సాధించడంతో పాటు అత్యున్నతమైన 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్' టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ వివరాలను శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మంగళవారం వెల్లడించారు. ట్రెడిషనల్ విభాగంలో 13 దేశాల నుంచి 31 మంది విద్యార్థులు పోటీపడగా దేవాన్ష్ ప్రథమ స్థానం దక్కించుకున్నాడు. అలాగే ఆర్టిస్టిక్ విభాగంలో 13 మందితో పోటీపడి మొదటి స్థానంలో నిలిచాడు. అనంతరం అన్ని విభాగాల్లో ప్రథమ స్థానం సాధించిన 10 మంది ఛాంపియన్లతో జరిగిన ఫైనల్ రౌండ్‌లో విజయం సాధించి 'ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్'గా నిలిచి దేశానికి గర్వకారణంగా నిలిచాడు. దేవాన్ష్ ప్రతిభను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, ప్రిన్సిపాల్ రవి కుమ్మమూరు, యోగా గురువులు సురేష్, జయంతితో పాటు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

# స్వర్ణకార సంఘం నిరసన

**మాడుగుల,మే 19 ప్రజా ప్రతిభ**


మాడుగులలో మోదకామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్వర్ణకార సంఘం సభ్యులు ప్రధానమంత్రి ఒక సంవత్సరం పాటు బంగారం కొనొద్దని పిలుపునివ్వడంతో స్వర్ణకారులు అందరికీ ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనికి మంగళవారం ఉదయం మోదకొండమ్మ శతకంపట్టు వద్ద నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్ కే. రమాదేవికి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశ్వరు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నరేంద్రమోడీ ఇచ్చిన స్టేట్మెంట్ కారణంగా తామంతా జీవనాధారం కోల్పోయామని ఈ కారణంగా బంద్ చేయడం జరిగిందని స్వర్ణకారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కామాక్షి స్వర్ణకార సంఘం అధ్యక్షులు పెదపల్లి రామచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీలామంతుల వాసు, కోశాధికారి నవర బ్రహ్మాజీ, సభ్యులు ఎస్. నాగేశ్వరరావు, పెదపల్లి రవి, నాగులకొండ రాజు, ఎం.మోహన్, శ్రీశైలపు అప్పలాచారి, నవర సతీష్, అప్పల బత్తుల విస్సు, పూడి శ్రీను, పెదపల్లి శివ, పాటోజు ఆచారి పాల్గొన్నారు.



# ప్రభుత్వ చెరువులు మింగేస్తున్న మట్టి మాఫియా: ఏఎంఆర్ ముసుగులో అక్రమ దందా..!

## నక్కపల్లి మండలం ఉద్దండపురంలో రెచ్చిపోతున్న ఏఎంఆర్ మైనింగ్ సంస్థ అక్రమాలు। రాత్రివేళల్లో జేసీబీలు, ట్రాక్టర్లతో యథేచ్ఛగా తవ్వకాలు। రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల మౌనం వెనుక మతలబేంటి..?

నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ):






పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఉద్దండపురం గ్రామంలోని ఊర చెరువు మట్టి మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకుంది. ఏఎంఆర్ మైనింగ్ సంస్థ పేరు చెప్పుకొని కొందరు అక్రమార్కులు ప్రభుత్వ చెరువును యథేచ్ఛగా తవ్వేస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అక్రమాల చిట్టా ఇలా...

ఏఎంఆర్ సంస్థకు మైనింగ్ అనుమతులు ఉన్నాయనే సాకుతో ఎలాంటి సరైన రసీదులు, ప్రభుత్వ అనుమతులు లేకుండానే రోజూ వందల ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏఎంఆర్ సంస్థ ఇచ్చిన రసీదులను అడ్డుపెట్టుకొని మట్టి మాఫియా దళారులు కమర్షియల్ వ్యాపారులకు మట్టిని అమ్ముకొని లక్షలు వెనకేసుకుంటున్నారు.




రాత్రివేళలే టార్గెట్పట్టపగలే కాకుండా రాత్రి వేళల్లో కూడా జేసీబీలు, ట్రాక్టర్లతో చెరువులో మట్టి తోలకాలు జోరుగా సాగుతున్నాయి. ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు ఇచ్చే రసీదుల్లో కొంత భాగం మాత్రమే సంస్థ ఖాతాలోకి వెళ్తోందని, మిగతా సొమ్ము సంస్థలోని కొందరు ఉద్యోగులు మాఫియాతో కుమ్మక్కై పంచుకుంటున్నారని స్థానికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

### నిబంధనలు తుంగలో తొక్కి...

ప్రభుత్వ చెరువుల్లో మట్టి తవ్వాలంటే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరి. కానీ ఇక్కడ మాత్రం ఏఎంఆర్ సంస్థ ఇచ్చిన బిల్లులే పర్మిషన్లుగా చూపిస్తూ మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలు పాటించాల్సిన ఏఎంఆర్ ప్రతినిధులే వాటిని ఉల్లంఘిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.అధికారుల తీరుపై అనుమానాలుఊర చెరువులో ఇంత పెద్ద ఎత్తున అక్రమ తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



కళ్లు మూసుకుని ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమని, అధికారుల అండదండలతోనే ఈ దందా సాగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.చెరువు మనుగడకే ప్రమాదంఏళ్ల తరబడి గ్రామానికి పంట భూమి అవసరాలు తీరుస్తున్న ఊర చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తోడేయడంతో చెరువు కట్టలు దెబ్బతిని మనుగడకే ముప్పు వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో చెరువుకు గండ్లు పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.డిమాండ్ చేస్తున్న గ్రామస్తులుఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఊర చెరువులో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్దండపురం గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేసి చెరువును కాపాడాలని కోరుతున్నారు.

# ఎంపీటీసీ కుంచే మధు డిమాండ్

## మద్రాస్ హైకోర్టు తీర్పును ఆదర్శంగా తీసుకోవాలి - విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి

## రాజ్యాంగ విలువలు భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్న వేంపాడు ఎంపీటీసీ "కుంచె మధు"

నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ)



తమిళనాడులో మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ ఇచ్చిన కీలక ఆదేశాలను ఆదర్శంగా తీసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల పాఠ్యప్రణాళికలోనూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్రను చేర్చాలని పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం, వేంపాడు ఎంపీటీసీ, సామాజిక కార్యకర్త కుంచే మధు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో చేపడుతున్న వినూత్న విద్యా సంస్కరణలను ప్రత్యేకంగా అభినందించారు. నైపుణ్య ఆధారిత విద్య, డిజిటల్ తరగతి గదులు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయ శిక్షణ వంటి విప్లవాత్మక నిర్ణయాలతో ఏపీ విద్యారంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రాజ్యాంగ విలువలను విద్యార్థులకు చేరువ చేసేందుకు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సోషల్ సైన్స్ పాఠ్యాంశాల్లో అంబేద్కర్ జీవిత విశేషాలు, రాజ్యాంగ రచనలో ఆయన పాత్ర, సామాజిక సమానత్వం కోసం సాగించిన పోరాటాన్ని చేర్చాలని కోరారు. ఇటీవల మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వ పాఠశాలల్లో అంబేద్కర్ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు."విగ్రహాల్లో కాదు.. పాఠ్యపుస్తకాల్లో నివాళి""సమ న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ విలువలను భావి తరాలకు అందించాలంటే, రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడి జీవితాన్ని పాఠ్యపుస్తకాల ద్వారా పరిచయం చేయడం ప్రభుత్వ బాధ్యత" అని కుంచే మధు పేర్కొన్నారు. ఇది ఏ రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తిని, సామాజిక చైతన్యాన్ని విద్యార్థుల్లో పెంపొందించే కార్యక్రమమని స్పష్టం చేశారు.

"నిజమైన నివాళి విగ్రహాల్లో, వేడుకల్లో కాదు.. ప్రతి బిడ్డకు అంబేద్కర్ ఎందుకు ముఖ్యమో తెలియజేయడంలోనే ఉంది" అన్న మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి పరిమితమైన నాయకుడు కాదని, యావత్ భారతదేశానికి, ముఖ్యంగా అణగారిన వర్గాలకు ఆశాజ్యోతి అని కొనియాడారు.సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తికాబట్టి మద్రాస్ హైకోర్టు తీర్పు స్ఫూర్తితో, మంత్రి లోకేష్ చేపడుతున్న విద్యా సంస్కరణల్లో భాగంగా రానున్న విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర సిలబస్‌లో అంబేద్కర్ జీవిత చరిత్ర, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన పాత్ర, ఆర్థిక, న్యాయ, సామాజిక రంగాల్లో ఆయన చేసిన కృషిని పాఠ్యాంశాలుగా ప్రవేశపెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఎంపీటీసీ కుంచే మధు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# పాఠంశెట్టి సూర్యచంద్రపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి

## దళిత నాయకుడి పై దాడి చేసిన పాఠంశెట్టిని అరెస్టు చేయాలి

## దళిత నాయకులు ,మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ డిమాండ్

గోకవరం మే 19 (ప్రజా ప్రతిభ న్యూస్)

టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పర్యటన భాగంగా బూరుగుపూడిలో దళిత నాయకుడు మురా సత్తిబాబు ప్రసారం చేస్తుండగా ఓర్వలేని పాఠం శెట్టి సూర్యచంద్ర కక్షపూరితంగా దాడి చేశాడని, చెప్పుతో కొట్టి, కులం పేరుతో బహిరంగంగా దూషించాడని అందుకు పాఠంశెట్టిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని దళిత నాయకులు, గోకవరం మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు స్థానిక టిడిపి కార్యాలయం నందు భరత్ మీడియా సమావేశం నిర్వహించి, పాఠం శెట్టి ఆగడాలను ఎండగట్టారు. అగ్రకుల అహంకారానికి ఇది పరాకాష్టని, రాజ్యాంగ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకమని భరత్ అన్నారు. మంత్రి నారా లోకేష్ పర్యటన విజయవంతం అయితే జగ్గంపేట సస్యశ్యామలంగా మారుతుందని , అందుకునే పాఠం శెట్టి ఓర్వలేక టిడిపిని, స్థానిక ఎమ్మెల్యేను అగౌరవపరిచే విధంగా ప్రవర్తించడం జరిగిందన్నారు. నిందితుడు పాఠంశెట్టి సూర్యచంద్రను 24 గంటల్లో అరెస్టు చేయాలని,బాధితుడికి రక్షణ మురా సత్తిబాబుకు పోలీసు రక్షణ కల్పించి, చట్ట ప్రకారం నష్టపరిహారం అందేలా చూడాలని భరత్ డిమాండ్ చేశారు. 48 గంటల్లో నిందితుడిని అరెస్టు చేయకపోతే, జిల్లా వ్యాప్తంగా దళిత సంఘాలు రోడ్లపైకి వస్తాయని భరత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ పిట్ట అరుణ్ కుమార్, పల్ల నరేష్, గునిపే భీమరాజు, జక్కల చిన్ని, చీకట్ల శ్రీను,మోటపర్తి ఆనంద్,ఆకాశపు కిరణ్, కొల్లపు చంటి, గునిపే భాను, కడుగుల వెంకటరమణ, ఉల్లి బంగారయ్య,నరిసెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# 1,480 సిలిండర్లు పంపిణీ

## మాడుగుల తహశీల్దార్ రమాదేవి

మాడుగుల, మే 19 ప్రజా ప్రతిభ:



గ్రామంలో ఇటీవల కాలంలో గ్యాస్ పంపిణీకి సంబంధించి కొన్ని ఇబ్బందులు ఏర్పడడంతో ఇప్పటివరకు 7వ తేదీ నుండి 19వ తేదీ వరకు మాడుగులకు సంబంధించి 1,480 సిలిండర్లు దేవరాపల్లికి చెందిన గ్యాస్ ఏజెన్సీ ద్వారా పంపిణీ చేయడం జరిగిందని తహశీల్దార్ కే. రమాదేవి. మంగళవారం ఉదయం తెలిపారు. రానున్న మోదకొండమ్మ జాతరకు సంబందించి 2వేల సిలిండర్లు కావాల్సి ఉందని గ్యాస్ ఏజెన్సీకి తెలియజేయడం జరిగిందని తహశీల్దార్ చెప్పారు. ఇప్పటివరకు గ్యాస్ సిలిండర్లకు ఇబ్బందులు లేకుండా పంపిణీ చేస్తున్నామని అన్నారు.

# మోదమ్మ ప్రసాదానికి విరాళం



మాడుగుల,మే 19 ప్రజా ప్రతిభ:

జూన్ 2వ తేదీన మాడుగుల మోదకొండమ్మ జాతర సందర్భంగా అమ్మవారి ఆలయంలో భక్తులకు పులిహోర ప్రసాదం పంపిణీ నిమిత్తం విశాఖపట్నం ఎన్ఏడి జంక్షన్ కాకానినగర్ చెందిన రియల్ ఎస్టేట్ బండి బుచ్చిబాబు రూ.30వేలను విరాళంగా ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు మంగళవారం ఉదయం ఆలయంలో అందించారు. జూన్ 2వ తేదీ మంగళవారం అమ్మవారి జాతర వైభవంగా జరుగుతుందని, జాతరకు రావాలంటూ ప్రత్యేకంగా బుచ్చిబాబును చైర్మన్ అప్పలరాజు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరంరెడ్డి అప్పలనాయుడు, శ్రీరంరెడ్డి వెంకట సూర్యనారాయణ పాల్గొన్నారు.

## పాండవుల చెరువు

# అభివృద్ధి పనులు ప్రారంభం



మాడుగుల,మే 19 ప్రజా ప్రతిభ:

ఉత్తరాంధ్ర ఇలువేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయం సమీపంలో ఉన్న పాండవుల చెరువుకు మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి కృషి ఫలితంగా మహర్దశ ప్రారంభమైంది. దీనికి సంబంధించి మంగళవారం ఉదయం టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. భారత్ బెల్ టెక్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వాటర్ షెడ్ (కలెక్టర్ నిధులు) రూ.50లక్షలతో పాండవుల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, స్టోన్ ప్యాకింగ్, మెట్ల నిర్మాణం వంటి పనులకు సంబంధించి పనులను 60 రోజుల్లోగా పూర్తి చేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఈ చెరువుకు ఈశాన్య దిశగా నీరు ఉన్న కారణంగాగ్రామ అభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధి జరుగుతుందని పుప్పాల లక్ష్మీనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ నానాజీ, పల్లెల రాము, యర్రంశెట్టి వరప్రసాద్, మిస్సికా గంగరాజు పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో

# ఎఫ్ఐడీ ఛైర్మన్‌కు ఘన సన్మానం

నక్కపల్లి, మే 19, (ప్రజా ప్రతిభ) :

పాయకరావుపేటలో మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, జనసేన నాయకులు తోట నగేష్ నివాసంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన ఎఫ్ఐడి చైర్మన్ గోవిందప్ప ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తోట నగేష్ మాట్లాడుతూ, గోవిందప్ప వివిధ రంగాల్లో చేస్తున్న సేవలను కొనియాడారు. సామాజిక, రాజకీయ రంగాల్లో పరస్పర సహకారం అవసరమని, ఇటువంటి ఆత్మీయ కలయికలు బంధాలను మరింత బలోపేతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. సన్మానం అందుకున్న అనంతరం గోవిందప్ప మాట్లాడుతూ, తోట నగేష్ చూపిన ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు. పాయకరావుపేట ప్రజల అభిమానం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, శ్రేయోభిలాషులు, పలువురు ప్రముఖులు పాల్గొని గోవిందప్ప కి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అల్పాహార విందు ఏర్పాటు చేశారు.



ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha Telugu Daily
www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com
బుధవారం
మే 20, 2026

## డా. నేలపూడి రామకృష్ణ కవికి అంబేద్కరీయ సాహిత్య సత్కారం

**- అంబేద్కర్‌పై కవితాగానంతో ఆకట్టుకున్న కవి**

**- శాలువా, జ్ఞాపికతో ఘన సన్మానం**




**పి. గన్నవరం, మే19 (ప్రజా ప్రతిభ):**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం మండలానికి చెందిన ప్రముఖ దళిత సాహితీవేత్త, జర్నలిస్ట్, అంబేద్కర్‌వాది, అంబేద్కర్ సాహితీ సమితి చైర్మన్ డా. నేలపూడి రామకృష్ణ కవికి అంబేద్కరీయ సాహిత్య సత్కారం లభించింది. రాజమండ్రి వీఎల్‌పురంలోని అంబేద్కర్ సేవా కేంద్రం చైర్మన్ డా. గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన "అంబేద్కరీయం" అంశంపై కవి సమ్మేళనంలో డా. రామకృష్ణ కవి పాల్గొని డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశిష్టతను ప్రతిబింబించే కంద పద్యాలు, కవితాగానం ద్వారా సభికులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాహిత్య సేవలను గుర్తించిన నిర్వాహకులు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కవులు, రచయితలు డా. నేలపూడి రామకృష్ణ కవిని అభినందిస్తూ, అంబేద్కర్ భావజాల ప్రచారంలో ఆయన చేస్తున్న కృషిని ప్రశంసించారు. సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించడంలో డా. రామకృష్ణ కవి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ గూటికి ఉమ్మడి వెంకట్రావు





**ప్రత్తిపాడు/తుని, మే 19 (ప్రజా ప్రతిభ) :**

భారతీయ జనతా పార్టీలో జిల్లా ఉపాధ్యక్షులుగా పని చేసిన ఉమ్మడి వెంకట్రావు ఇటీవల పార్టీకి గుడ్ బై చెప్పారు. ఈ నేపథ్యంలో మంగళవారం విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో ఆహ్వానించారు. 2019లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన వెంకట్రావు పార్టీలో పలు కీలక పదవులను అలంకరించి ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా బరిలో దిగారు. తధానంతరం రాజకీయ పరిణామాలు దృశ్య కాంగ్రెస్ పార్టీని వీడి భాజపాలో పనిచేశారు. వ్యక్తిగత కారణాలు దృశ్య ఇటీవల భాజపాను వీడాల్సి వచ్చింది. కాగా మాజీ కేంద్రమంత్రి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు మల్లిపూడి మంగపతి పల్లంరాజు ప్రోత్సాహంతో మళ్లీ తన సొంత గూటికి చేరినట్లు చెప్పారు. ఆయనతోపాటు నియోజకవర్గాల్లోనే రౌతులపూడి మండలం కోట శ్రీను, రామగుర్తి సూర్యనారాయణ, యనమల రాజా, దంత శెట్టి చంద్రశేఖరు, గోన్ ఆఫ్ శ్రీనివాస్, యనమల కిరణ్, ఈ పి రమణ తదితరులను వైయస్ షర్మిల రెడ్డి కాంగ్రెస్ అందువలన కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ఇంచార్జ్ గణేష్ యాదవ్, జాయింట్ సెక్రెటరీ పాలక్ వర్మ, పీసీసీ కాకినాడ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, పెద్దాపురం ఇంచార్జ్ మరకల సూరిబాబు తదితరులు ఉన్నారు.

## దివంగత నేత పారుపల్లి బాబురావు కుమార్తె కరుణా లక్ష్మి పుష్పావతి వేడుకలు ఘనంగా

**ముఖ్య అతిథిగా జగ్గంపేట**

**జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్**

**గోకవరం మే 19 (ప్రజా ప్రతిభ న్యూస్)**

జనసేన పార్టీ కామరాజుపేట గ్రామ పంచాయతీ అభ్యర్థిగా పోటీ చేసిన దివంగత నేత పారుపల్లి బాబురావు, కుమార్తె పుష్పావతి వేడుకలు మంగళవారం నాడు కామరాజుపేట గ్రామంలో తమ నివాసంలో భారీగా ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కామరాజుపేట గ్రామ జనసేన పార్టీ యువ నాయకులు పారుపల్లి వీరబాబు, పారుపల్లి చలం, సోదరుడు దివంగత నేత జనసేన పార్టీ పంచాయతీ అభ్యర్థిగా పోటీ చేసిన పారుపల్లి బాబురావు, కుమార్తె కరుణా లక్ష్మి పుష్పావతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, కామరాజుపేట జనసేన పార్టీ నాయకులు రాజమండ్రపు నరసింహమూర్తి, గుల్లంపూడి నాగేశ్వరరావు, కలవలపల్లి చిన్న, రాజమండ్రపు శ్రీను, మార్పిన చంద్రరావు, రాజమండ్రపు బుజ్జి, నీలం నాగేంద్ర, గోకవరం మండలం నాయకులు దసుపాటి సుబ్బారావు, కన్నా, నాగేందర్, బిజెపి నాయకులు ముక్క శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, నియోజవర్గ జనసేన పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు భారీగా పాల్గొని చిన్నారి కరుణా లక్ష్మిని, అక్షింతలతో ఆశీర్వదించారు. అనంతరం పారుపల్లి వీరబాబు, పారుపల్లి చలం, ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.





# ప్రజా సేవలోనే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**కోరుకొండ కార్యాలయంలో**

**అందుబాటులో ఉంటూ స్వయంగా అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే**







**గోకవరం మే 19( ప్రజా ప్రతిభ న్యూస్)**

కార్యాలయానికి పోటెత్తిన నియోజకవర్గ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరి సమస్యను ఓపికగా ఆలకించి, తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యేప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: శ్రీ బత్తుల బలరామకృష్ణరాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటున్నారు. ఇందులో భాగంగా వారు కోరుకొండలోని కార్యాలయంలో అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుంటున్నారుఈ రోజు ఉదయం నుంచే కోరుకొండ కార్యాలయానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు, జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యాలయానికి విచ్చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి, వారి వారి గ్రామాల్లో ఉన్న సమస్యలను, వ్యక్తిగత ఇబ్బందులను కూలంకషంగా అడిగి తెలుసుకున్నారునియోజకవర్గ పరిధిలోని మౌలిక వసతులు, తాగునీటి ఎద్దడి, అంతర్గత రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మరియు పింఛన్లు, రేషన్ కార్డుల వంటి పలు సామాజిక సమస్యలపై ప్రజల నుండి ఎమ్మెల్యే స్వయంగా అర్జీలను (వినతిపత్రాలను) స్వీకరించారు. ప్రజా దర్బార్ తరహాలో సాగిన ఈ కార్యక్రమంలో అర్జీలు సమర్పించిన ప్రతి ఒక్కరికీ త్వరితగతిన న్యాయం చేస్తానని ఆయన భరోసా ఇచ్చారుప్రజలు సమర్పించిన అర్జీలపై ఎమ్మెల్యే తక్షణమే స్పందించారు. పలు తీవ్రమైన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే ఫోన్ ద్వారా మాట్లాడారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, త్వరితగతిన క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, ఆయా సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ "రాజానగరం నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే నా ప్రధాన సంకల్పం. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా పనిచేస్తోంది. ప్రజలు తమ సమస్యల నివృత్తి కోసం ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా నన్ను సంప్రదించవచ్చు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని ఒక బాధ్యతగా తీసుకుని, పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షిస్తాంకార్యాలయంలో ఎమ్మెల్యే తమకు అందుబాటులో ఉంటూ, తమ సమస్యలను ఓపికగా విని, అర్జీలు స్వీకరించడం పట్ల నియోజకవర్గ ప్రజలు మరియు కూటమి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇసుక రవాణా చేసేటప్పుడు ప్రజలకు ఇబ్బంది కలిగితే ఉపేక్షించేది లేదు

**ఇసుక కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం**

**జరిపిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**

**గోకవరం మే 19 (ప్రజా ప్రతిభ న్యూస్)**





రోడ్లు, రవాణా మార్గంపై వాహనాలపైనుండి ఇసుక జారి పడటంపై మండిపాటుఅధిక లోడ్, తార్పాల్ లేకపోవడం వల్ల రోడ్లపై జారిన ఇసుకను కాంట్రాక్టర్లే రెండు రోజుల్లో శుభ్రపరచాలని ఆదేశంఅధిక లోడ్లు, ఓవర్ స్పీడ్ తగ్గించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికఎప్పటికప్పుడు వాహనాలకు సామర్థ్యం చెక్ చేసుకోవాలని , సరైన అనుమతులతో అనుభవం గల డ్రైవర్లుతో మాత్రమే ఇసుక రవాణా చేయాలని సూచన లోడ్ అయిన తర్వాత ప్రతీ వాహనంపై పూర్తిగా కవర్ (తార్పాల్) తో కప్పేటట్టు పూర్తి జాగ్రత్తలు తీసుకోండిప్రజలకు ఇబ్బంది కలిగించేలా తప్పు చేస్తే తుప్పు రేగ్గొడతాప్రభుత్వ నిబంధనలను అనుగుణంగా ఇసుక కాంట్రాక్టర్లు పనిచేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని మండల తహసీల్దార్ కు సూచనరాజానగరం నియోజకవర్గం సీతానగరం మండలం మండల తహసీల్దార్ వారి కార్యాలయంలో నియోజకవర్గంలో గల ఇసుక కాంట్రాక్టర్లతో తహసీల్దార్ అంకం శ్రీనివాసరావు తో కలిసి రాజానగరం నియోజకవర్గ గౌరవ శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ జరిపిన సమీక్ష సమావేశంలో ఇసుక కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పలు సూచనలు, సలహాలు, హెచ్చరికలు ఇవ్వడం జరిగిందిప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇసుక తవ్వకాలు జరిపి వాహనాలకు లోడ్ చేసేటప్పుడు పరిమితికి మించి లోడ్ చేయకూడదని లోడ్ పూర్తి అయిన తర్వాత వాహనంపై పూర్తిగా కవర్ (టార్పాల్) తో మూసివేసి రోడ్ల వెంబడి ప్రయాణించేటప్పుడు ముఖ్యంగా జనావాసాల మధ్య అధిక స్పీడ్ ఉండకూడదని వాహనాల సామర్థ్యం ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సరైన అనుమతులు వెంట ఉండేలా ప్రయాణించాలని సూచించారు. అలానే ఓవర్ లోడ్, హై స్పీడ్ , వాహనానికి తార్పాల్ లేకుండా ప్రయాణం చేసేటట్టు అయితే కఠిన చర్యలు తీసుకొంటామని స్పష్టమైన హెచ్చరిక జారీ చేసారు. రోడ్ల వెంబడి జారిన ఇసుకను కాంట్రాక్టర్లే రెండు రోజుల్లో శుభ్రపరచాలని ఆదేశించారుఈ కార్యక్రమంలో ఇసుక కాంట్రాక్టర్లతో పాటు ప్రభుత్వ అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఆర్థిక భరోసా కల్పించండి....

**అరకులోయ టిడిపి ఇన్చార్జ్ శివేరి దొన్నుదొరకు**

**వినతి పత్రం అందించిన బూర్జ గ్రామపంచాయతీ**

**ఎంపిటిసి మజ్జి హరి**

**అరకులోయ, మే 19(ప్రజాప్రతిభ ):**

ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ మంజూరు చేసి నిరుపేద కొండ దొర గిరిజన కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని మృతుల కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి మంగళవారం ఫిర్యాదు దరఖాస్తు సమర్పించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ నియోజకవర్గం అనంతగిరి మండలం వాలసి గ్రామపంచాయతీ మల్లంగుమ్మి జలపాతంలో 09-ఏప్రిల్-2026 తేదీన బూర్జ గ్రామపంచాయతీ జుంబు వలస విద్యార్థులు ఈత సరదా కోసం జలపాతంలో ప్రమాదవసతు మరణించిన విషయం తెలిసిందే.. వివరాలు ఇలా ఉన్నాయి.. 1 సలేపు త్రిష. తల్లి. పొల్లుబుడి. తండ్రి కొండ. 2.సాలెపు. పవిత్ర. తల్లీ సోశీల. తండ్రి సుందోర్. 3.సాలెపు రత్నా కుమారి. తల్లీ గాంగు. తండ్రి దేముడు. నిరుపేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ తో ఆర్థిక భరోసా కల్పించాలని మృతువుల కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.. జుంబువలస గ్రామం హుకుంపేట మండలం అల్లూరి జిల్లాకు చెందిన గిరిజన నిరుపేద కొండదొర మృతువుల కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రిలీఫ్ ఫండ్ నుండి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలని, బూర్జ గ్రామ పంచాయతీ ఎంపీటీసీ మజ్జి హరి ఆధ్వర్యంలో మంగళవారం అరకులోయ టిడిపి ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొరకు ఒక ఫిర్యాదు దరఖాస్తు వినతి పత్రం అందించారు.. ఈ కార్యక్రమంలో చిన్నబాబు, మృతుల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# భరోసా పార్టీ అధ్యక్షుడిపై ఉన్మాదుల అతి కిరాతక దాడిని ఖండించండి

## సమగ్ర విచారణ జరిపించి దోషులను శిక్షించాలి.

## ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్




**అరకు లోయ, మే 19( ప్రజా ప్రతిభ):**

అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రశాంతమైన స్వచ్ఛమైన ఆదివాసీ ప్రాంతం చింతపల్లిలో భరోసా పార్టీ అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై గుర్తుతెలియని దుండగులు, ఉన్మాదులు అతికిరాతకంగా దారుణంగా మరణ ఆయుధాలతో కాపుగాసి దాడి చెయ్యడం దుర్మార్గమని, ఈ ఘటను ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా ఖండించింది. అరకువేలి గిరిజన సంఘం భవనంలో మీడియా సమావేశం ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, స్వచ్ఛమైన జీవనవిధానానికి విఘాతం కలిగించే విధంగా, ఏజెన్సీ ప్రాంతంలో ఒక రాజకీయ పార్టీ అధ్యక్షుడిపై పట్టపగలు నడిరోడ్డుపై గుర్తు తెలియని దుండగులు, ఉన్మాదులు దాడి చేయడం ప్రభుత్వ వైఫల్యం. కత్తులు కర్రలతో కిరాతకా దాడి చెయ్యడం హేమమైన చర్యని ఇది పథకం ప్రకారం జరిగిన హత్య యత్నం. ఇటువంటి భౌతిక దాడుల ఏజెన్సీ ప్రాంతం లో అశాంతిని సృష్టిస్తుంది. ఆదివాసీ ప్రజల్లో భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఇటువంటి అరాచక సంస్కృతి ఏజెన్సీ ప్రాంతంలో లేదని, కొంతమంది వ్యక్తులు కావాలని ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి ఘటనకు కారణం అవుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యల మీద బహిరంగంగా మాట్లాడుకునే హక్కు రాజ్యాంగం ప్రతి ఒక్కపరుడు ఇచ్చిందని వీటిని జీర్ణించుకోలేక ఇంటివటి ఘటనకు కొంతమంది పూనుకుంటున్నారు. ప్రకృతి ఆరాధకులైన ఆదివాసులను కొన్ని వర్గాల వారు తమ ఆధిపత్యం కోసం అనేక ప్రయత్నాలు చేస్తూ ఆదివాసీ ప్రజలపై తమ మతం రంగు పూస్తున్నారు. బలవంతం రుద్దుతున్నారు. భరోసా పార్టీ అధ్యక్షులు అభినయన్ దర్శన్ పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ దాడి పై సమగ్ర సమాచారాన్ని ప్రజలకే ప్రభుత్వం తెలియజేయాలని కానీ ప్రభుత్వ ఇప్పటికే వీటిని పక్క దారి పట్టించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఇటువంటి చర్యలకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు ఖండించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటన పునరుద్దరణ కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణ కోసం ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడం వల్ల ఆదివాసీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కావాలనే మతం పేరుతో ఆదివాసులను రెచ్చగొడుతున్నారని. ప్రభుత్వం వాటిని నివారించవలసిన బాధ్యత ఉందన్నారు, ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, పాంగి నానిబాబు పాల్గొన్నారు.

# కామ్రేడ్ సుందరయ్య 41వ వర్ధంతి వేడుకలు ఘనంగా

## సుంకర మెట్ట పంచాయతీ దాబుగూడలో జెండావిష్కరణ

**అరకు లోయ, మే 19( ప్రజా ప్రతిభ):**

కామ్రేడ్ సుందరయ్య 41 వ వర్ధంతి సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు గెమ్మెలి చిన్నబాబు అద్యక్షతన సుంకర మెట్ట పంచాయతీ దాబుగుడ లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. సుందరయ్య వర్ధంతి సందర్భంగా దాబుగుడ గ్రామస్తులకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ పి.అప్పలనరస పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉన్న ఖనిజాలు ఆదివాసుల హక్కుల చట్టాలు నిర్వీర్యం కాకుండా నిరంతరం కృషి చేస్తున్న ఎర్రజెండా తోనే ఆదివాసులకు రక్షణ ఉంటుంది అని అన్నారు. ఆదివాసుల కు ఎర్రజెండా అవసరమని దాబుగుడ ఆదివాసి గిరిజనులు పార్టీ లో పనిచేయడానికి సిద్ధమయ్యారని అన్నారు. సుందరయ్య సంపన కుటుంబానికి చెందిన వారు సుందరయ్య తన జీవితంలో బుడుగు బలహీన వర్గాల కోసం అంటరానితనం నిర్మూలనకు కోసం అందరికి కూడు, గూడు, బట్ట కావాలని మహిళలకు రక్షణ సమానత్వం స్వేచ్ఛ కావాలని నిరంతరం కృషి చేశారు. దున్నే వాడిదే భూమి అన్న నినాదంతో విరోచిత ఫోరాటలు నిర్వహించారు. సుందరయ్య ఆస్థి పేద ప్రజలకు పంచి పెట్టిన ఘనత కమ్యూనిస్టు పార్టీ నిర్మాత సుందరయ్య కి ఉంది. స్వంత ప్రయోజనం కంటే ప్రజల ప్రయోజనాలే మిన్నాగ భావించి తను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసారు. మనమంతా సుందరయ్య బాటలో ప్రయాణం చేస్తూ మన ప్రాంత అభివృద్ధికి కోసం ఆదివాసులు ఐక్యంగా ఎర్ర జెండా నీడలో భవిష్యత్తులో పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు పంచాయతీ నాయకులు చిట్టెం నాయక్ గురు మూర్తి, పాంగి. నాని బాబు, సి హెచ్ కెసిబో,కె.చిట్టిబాబు, దాబుగుడ గ్రామస్తులు కె.విజయ్, సన్యాసిరావు, బి.సుబ్బారావు. బి.సన్యసిరావు, బి. ఆనంద్, కె.ఆనంద్ కుమార్, బి ప్రేమ్ కుమార్,బి.శ్రీను, బి.బాస్కరావు, డొంబు, బి.విజయలక్ష్మి,కె. శివ, బి రమేష్, బి.రూబి, బి.బుజ్జిబాబు,కె.శిరిష బి.కాజల్, బి.నందిని, బి.శాల్మి, బి.పూల్మ్, బి. లక్ష్మి, బి.లక్ష్మి, బి.లింగో, తదితరులు పాల్గొన్నారు.



# పేరుకే జిల్లా ఆసుపత్రి గిరిజనుల ప్రాణాలకు రక్షణ ఎక్కడ?

## అంబులెన్స్ నిర్లక్ష్యంతో గిరిజన మహిళ, పసిబిడ్డ మృతి

## కూటమి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ఈ మరణాలకు కారణం

## బాధ్యులపై హత్య కేసులు నమోదు చేయాలి.

## పి.సి.సి డెలిగేట్ మెంబర్ పాచిపెంట చిన్నస్వామి డిమాండ్

**అరకు లోయ, మే 19( ప్రజా ప్రతిభ ):**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గ అరకు వేలి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా మిత్రులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా ప్రకటన విడుదల చేశారు. పాడేరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి (జిజిహెచ్)లో వైద్యుల నిర్లక్ష్యం, అత్యవసర వైద్య సదుపాయాల కొరత, అంబులెన్స్ సేవల వైఫల్యం కారణంగా వరుసగా గిరిజనుల ప్రాణాలు కోల్పోతుండటం అత్యంత దారుణమని పి.సి.సి డెలిగేట్ మెంబర్ పాచిపెంట చిన్నస్వామి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అనంతగిరి మండలం పైనంపాడు పంచాయతీ కాకరపాడు గ్రామానికి చెందిన నందుల కరుణమ్మ (38) తీవ్ర అస్వస్థతతో బాధపడుతుండగా సరైన వైద్యం, అంబులెన్స్ సకాలంలో అందించకపోవడంతో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఒక ఆసుపత్రి నుండి మరో ఆసుపత్రికి తిప్పుతూ చివరకు అంబులెన్స్ ఇవ్వకపోవడం ప్రభుత్వ వైద్య వ్యవస్థ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అలాగే హుకుంపేట మండలం గడికించుమండ గ్రామానికి చెందిన బంగురు రమేష్ సుమలత దంపతుల పసికందు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా పాడేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పిల్లలకు అవసరమైన వైద్య పరికరాలు లేకపోవడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించినప్పటికీ, అంబులెన్స్ గంటల తరబడి రాకపోవడంతో ఆ పసి ప్రాణం కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాచిపెంట చిన్నస్వామి మాట్లాడుతూ "ఏజెన్సీ ప్రాంత ప్రజలు గిరిజనులు కాబట్టి వారి ప్రాణాలకు విలువ లేదా? పేరుకే జిల్లా ఆసుపత్రి కానీ, అక్కడ కనీస అత్యవసర వైద్య సదుపాయాలు కూడా లేవు. అంబులెన్స్ కోసం కుటుంబ సభ్యులు వేడుకున్నా స్పందించకపోవడం అమానుషం. ఇది సాధారణ నిర్లక్ష్యం కాదు ప్రభుత్వ వైద్య వ్యవస్థ చేసిన ప్రాణహత్య" అని మండిపడ్డారు. "ఒక గిరిజన మహిళ, ఒక పసిబిడ్డ ప్రాణాలు కోల్పోవడానికి కూటమి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే కారణం. గిరిజన ప్రాంతాల్లో వైద్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. అధికారులు కేవలం ప్రకటనలకే పరిమితమై ప్రజల ప్రాణాలను పట్టించుకోవడం లేదు" అని విమర్శించారు. "నందుల కరుణమ్మ మరణం, పసిబిడ్డ మృతిపై వెంటనే న్యాయ విచారణ జరిపి జిజిహెచ్ సూపరింటెండెంట్, సంబంధిత వైద్యులు, అంబులెన్స్ బాధ్యులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అవసరమైతే హత్య కేసులు నమోదు చేయాలి" అని డిమాండ్ చేశారు. అలాగే కరుణమ్మ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పసిబిడ్డ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత ఆసుపత్రుల్లో: 24 గంటల అంబులెన్స్ సేవలు ప్రత్యేక వైద్య బృందాలు పిల్లల అత్యవసర చికిత్స విభాగాలు ఆక్సిజన్, వెంటిలేటర్, ఐసీయూ సదుపాయాలు నిపుణులైన వైద్యుల నియామకం తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిరిజనుల ప్రాణాలను నిర్లక్ష్యం చేసే అధికారుల వైఖరి మారేంతవరకు ప్రజా ఉద్యమాలు, ధర్నాలు, ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. గిరిజనుల ప్రాణాలను కాపాడండి! వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోండి!అంబులెన్స్ వ్యవస్థను బలోపేతం చేయండి! కరుణమ్మ కుటుంబానికి, పసిబిడ్డ కుటుంబానికి న్యాయం చేయాలి!పాడేరు జిల్లా ఆసుపత్రికి పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలి ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పాంగి గంగాధర్, డుంబురిగూడ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తేడాబారికి భీమ రావు తదితరులు పాల్గొన్నారు.




# అదరగొట్టిన ఆదివాసీ బాలిక రెజ్లర్లు

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున

## సోములగూడెం ఆశ్రమ పాఠశాల రెజ్లర్లు అద్భుత ప్రదర్శన



**వరరమచంద్రపురం, మే 19(ప్రజా ప్రతిభ )**





పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం వి.ఆర్ పురం మండలం సోములగూడెం గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థినిలు మడకం సురేఖ,33 కేజీల , బంధం సరిత 36 కేజీల అండర్ 15 విభాగాలలో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి లో ఈ నెల 16,17 తేదీలలో జాతీయ స్థాయి సౌత్ ఇండియా రెజ్లింగ్ ఛాంపియన్షిప్ 2026 పోటీలకు హాజరై మడకం సురేఖ అద్భుత ప్రదర్శన కనబరిచి 33కేజీల విభాగం లో మొదట తెలంగాణ, తరువాత కేరళ, తమిళనాడు రాష్ట్రలతో పోటీ పడి విజేతగా నిలిచి ఫైనల్ లో కర్ణాటక రాష్ట్రంతో స్వర్ణ పతకం కోసం పోటీపడి కాంస్యం పతకం సొంతం చేసుకున్న సురేఖ,తదుపరి బంధం సరిత 36 కేజీల విభాగం లో మొదట కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రలతో పోటీ పడి సెమీఫైనల్ చేరుకొని కేరళ చేతిలో ఓడిపోయి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఓవరాల్ ఛాంపియన్ షిప్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలికల విభాగం లో మూడవ స్థానం సాధించారని పేర్కొన్నారు, సౌత్ ఇండియా రెజ్లింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో సోములగూడెం పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాల కి మంచి పేరు తెచ్చుకునందుకు రెజ్లర్లు మరియు పిడి శివకుమార్ కి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండా సునీత మరియు పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

# నిరుపేద కోయ ఆదివాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

## లక్ష్మీదేవిపేటలో 30 కుటుంబాలు తహాశీల్దార్‌కు ఫిర్యాదు.



**పోలవరం జిల్లా బ్యూరో :మే 19 (ప్రజా ప్రతిభ )**

పోలవరం జిల్లా యటపాక మండలం లక్ష్మీదేవిపేట గ్రామ పంచాయతీ పరిధిలో నివాసం ఉంటున్న నిరుపేద కోయ ఆదివాసుల కుటుంబాలకు తక్షణమే ఇళ్ల పట్టాలు మంజూరు చేసి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బాధితులు మంగళవారం స్థానిక తహాశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 86/1లో ఉన్న 1.13 ఎకరాల ప్రభుత్వ భూమిలో సుమారు 30 ఆదివాసి కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నాయని తెలిపారు.తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినా ఇప్పటివరకు స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు గిరిజనేతరులు ఆ భూమి తమ పట్టా భూమి అంటూ తప్పుడు ప్రచారం చేస్తూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగానే ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండానే ఇళ్లు ఖాళీ చేయాలని ప్రాజెక్ట్ అధికారులు చెప్పారని పేర్కొన్నారు.షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూ బదలాయింపు నిరోధక చట్టం (1/70) ప్రకారం ప్రభుత్వ భూములపై హక్కులు స్థానిక ఆదివాసులకే ఉంటాయని, గిరిజనేతరులకు ఎలాంటి హక్కులు ఉండవని కుంజ శ్రీను గుర్తుచేశారు. లక్ష్మీదేవిపేటలో నివాసం ఉంటున్న ఆదివాసుల స్థలాలను క్రమబద్ధీకరించి వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ సమస్యపై ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని ఆదివాసులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దశల వారీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అపక ఈశ్వరమ్మ, గుండి సావిత్రి, మీడియం ప్రసాద్, బైరి లక్ష్మి, కోడి దుర్గ, తెల్లం వెంకటేష్, మీడియం భద్రయ్య, నుపా పార్వతి తదితరులు పాల్గొన్నారు.ద

# అనారోగ్యంతో ఉన్న జక్కయ్యమ్మకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి

**రాజవొమ్మంగి మే 19(ప్రజా ప్రతిభ)**



రాజవొమ్మంగి మండలం శరభవరం గ్రామానికి చెందిన వృద్ధ మహిళ జక్కయ్యమ్మ తీవ్ర అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆమె కాలికి తీవ్ర గాయం కావడంతో రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉన్న సదుపాయాలతో చికిత్సతో పాటు అవసరమైన మందులు అందిస్తున్నట్లు సమాచారం. అయితే గాయం తీవ్రత ఎక్కువగా ఉండటంతో జక్కయ్యమ్మ ప్రస్తుతం పనులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబ ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని గ్రామస్థులు తెలిపారు. వృద్ధాప్యంలో ఉన్న ఆమె భర్త ఒక్కరే కుటుంబ బాధ్యతలు భరించాల్సి రావడంతో దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జక్కయ్యమ్మ కుటుంబ పరిస్థితిని గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతలు మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన వైద్య చికిత్సతో పాటు జీవనోపాధికి కూడా తోడ్పాటు అందిస్తే వృద్ధ దంపతులకు ఊరటనిస్తుందని పేర్కొన్నారు. సమాజంలోని దాతలు ముందుకు వచ్చి జక్కయ్యమ్మ కుటుంబానికి అండగా నిలవాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు. ప్రస్తుతం సహాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్న ఈ వృద్ధ దంపతుల పరిస్థితి స్థానికులను కలచివేస్తోంది.

## మెడికల్ షాపుల బంద్‌కు సంబంధించి
# వినతి పత్రాలు అందజేసిన కెమిస్టులు






**రాజవొమ్మంగి మే19 ప్రజాప్రతిభ న్యూస్**

దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న మెడికల్ షాపుల బంద్‌కు సంబంధించి రాజవొమ్మంగిలోని కెమిస్టులు మంగళవారం రెవెన్యూ, పోలీస్ శాఖలకు వినతిపత్రాలు అందజేశారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు కెమిస్టులు తెలిపారు. కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొన్ని ఆదేశాలను రద్దు చేయాలని, అలాగే ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న నకిలీ మరియు ప్రమాదకర మందుల విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రిస్క్రిప్షన్ ధృవీకరణ లేకుండానే ఆన్‌లైన్‌లో మందులు విక్రయించబడుతున్నాయని, భారీ డిస్కౌంట్ల పేరుతో కార్పొరేట్ సంస్థలు మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయని కెమిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల స్థానిక మెడికల్ షాపులు తీవ్రంగా నష్టపోతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్ మందుల అమ్మకాలను కట్టడి చేయాలని, కార్పొరేట్ సంస్థలు ఇస్తున్న అధిక డిస్కౌంట్లను నియంత్రించాలని, అలాగే నకిలీ మందుల సరఫరాను పూర్తిగా అరికట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# జీలుగుమిల్లిలో సుందరయ్య వర్ధంతి నిర్వహణ

### పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్

### ప్రజా సమస్యలపై సీపీఎం నాయకుల ఆందోళన





**జీలుగుమిల్లి, మే 19 (ప్రజా ప్రతిభ) :**

ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్. లింగరాజు, పార్టీ కార్యవర్గ సభ్యుడు కే. శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ప్రజా సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. లింగరాజు మాట్లాడుతూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జీలుగుమిల్లి మండల కేంద్రంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించి ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ సిరిబత్తుల సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు తెల్లం శంకరుడు, తోడం గంగులు, కారం నాగదుర్గ, చిట్టిబొమ్మ కొండలరావు, గుండె గంగరాజు, రైతు సంఘం నాయకులు సుంకవల్లి శేషగిరిరావు, జానకిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు.

# పశువు పోషణ బరువు.!

### రైతులను వెంటాడుతున్న ఎండు గడ్డి కొరత
### యంత్రాల ద్వారా మాసూళ్లు
### ట్రాక్టర్ గడ్డి రూ.15 వేల నుంచి రూ.20 వేలు
### ఖర్చు ఎక్కువ దిగుబడి తక్కువ
### పంట పొలాల్లో పశువు పెడుతున్న రైతులు
### పశు పోషణ కోసం ప్రజలు అవస్థలు.!







**పొలంలో ఒట్టి గడ్డికి నిప్పు**

**నంద్యాల బ్యూరో మే 19, ప్రజా ప్రతిభ :**

నంద్యాల జిల్లా పాములపాడు మండలం పశుగ్రా సం కరువైంది. వేసవి వచ్చిందంటే పశువులకు మేత కష్టాలు తప్పవు. వేసవికాలంలో మేత, నీరు దొరక్క మూగ జీవాలు అల్లాడుతున్నాయి. పశుగ్రాసం కరువు కావడంతో రైతులు పొరుగు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పశువుల ఎండు గడ్డి కి నిప్పు పెడుతున్నారు. పశువుల పెంపకం రైతులకు భారంగా మారుతోంది ప్రభుత్వ ప్రోత్సాహం కరువవ్వడంతో కూలీల కొరత వేధిస్తోంది. ఎండుగడ్డి తగినంత లేకపోవడం, పచ్చిక బయళ్లు, ఖాళీ బంజరు భూములు తగ్గిపోవడం వంటి కారణాలతో పశువులకు మేత కరువవుతోంది. దీంతో పశుపోషణ రైతులకు భారంగా మారింది. పూర్వం ప్రతి రైంజూ కమతం గొడ్లశాల, గడ్డివాము, పాడి పశువులతో కళకళలాడేది. నేడు ఏ రైతు మకాం చూసినా కళ్లలు కళగా కనిపించట్లేదు. పల్లె ప్రజలు సైతం ప్యాకెట్ పాలపైనే ఆధారపడుతున్నారు. గతంలో ఓ సాధారణ రైతుకు వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం ద్వారా అదనపు ఆదాయం చేకూరేది. గేదె పాలు ఇంటి అవసరాలకు పోను, మిగిలిన పాలు విక్రయించు కోవడం ద్వారా కుటుంబ పోషణ జరిగిపోయేది పల్లె సీమలంటేనే పాడి పంటలకు నెలవు. అటువంటి పల్లెల్లో వ్యవసాయం కళ తప్పుతోంది. సీజన్ పంటలు వేసేందుకు రైతులు భూమిని చదును చేసుకుంటున్నారు. భారమైన పశువు గ్రాసం ఎండాకాలంలో వట్టి గడ్డికి నిప్పు పెట్టడం వల్ల పశువులకు గ్రాసం కొరత ఏర్పడుతుంది.
పంట పొలాల్లో వట్టి గడ్డికి నిప్పు పెట్టడం వల్ల భూమికి భూసారం తగ్గి పంటలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

### పశుగ్రాసం కొరత ఏర్పడటంతో..

ఒక గేదె లేదా అవుకు ఏడాది పొడవునా రెండున్నర ఎకరాల వరి చేలో గడ్డి అవసరం అవుతుంది. గేదె, ఆవు సరాసరిన 5 నుంచి 7లీటర్ల వరకు పాలు ఇస్తుంది. కూలి రేట్లు పెరగడంతో వరి మసూళ్లను యంత్రాలతో చేపట్టారు. ఈ కారణంగా ఎండు గడ్డి దొరకట్లేదు. ఎకరం ఎండుగడ్డి మిషన్తో కోసిందయితే రూ.4 వేలు ఉంది. అదే కూలీలతో కోసిందైతే రూ.10 వేలు పైనే పలుకుతోంది ఒక గేదె/అవుకు ఎండుగడ్డి కోసం రూ. 25 వేలు ఖర్చు అవుతుంది. పశువుల కాపరికి రోజు కూలిగా రూ.600 నుంచి రూ.700 వరకు చెల్లించాల్సి వస్తోంది పచ్చిక భూములు, పుంత భూములు లేకపోవడంతో పశువులకు గ్రాసం కొరత ఏర్పడడంతో దాణాలపైనే ఆధారపడుతున్నారు. గేదె ధర రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఉండగా ఆవు ధర రూ.40 వేల నుంచి రూ.60 వేలు వరకు పలుకుతోంది. ఇంత ధర పెట్టి కొనుగోలు చేసినా పాలు దిగుబడులు లభించకపోవడంతో పాడి పరిశ్రమలు కనుమరుగవుతున్నాయని రైతులు నష్టపోతున్నారు. పాలుకు గిట్టబాటు ధర లేకుండా పోయింది. పాడి పరిశ్రమకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు కేవలం ప్రకటనలకే పరిమితయ్యాయనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. రాయితీలకు మంగళం గతంలో సైలేజ్ గడ్డిని రైతులకు సబ్సిడీపై అందించేవారు. ప్రస్తుతం ఇవ్వట్లేదు. పశుక్రాంతి పథకం ద్వారా సన్న, చిన్న కారు రైతులకు పాడి పశువులకు రాయితీ అందించే పథకానికి మంగళం పాడేశారు. పశువులు మరణిస్తే బీమా వర్తించట్లేదు పళ్ళు సమగ్ర క్షేత్రాలు, పశు గ్రాసం కోసం ఇచ్చే ప్రోత్సాహం నిలిచిపోయాయి.. ఈ నేపథ్యంలో పాడి పశువుల పెంపకం రైతులకు గుదిబండలా మారింది తద్వారా పశువుల సంఖ్య గణనీయంగా తగ్గి భవిష్యత్తులో పాడి పరిశ్రమ కనుమరుగై కృత్రిమ పాలు, ప్యాకెట్ పాలకే పరిమితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి ప్రభుత్వం మాత్రం ఇప్పుడు సైలేజ్ గడ్డి స్థానంలో టోటల్ మిక్స్ దాణా, సమీకృత దాణా అందిస్తోంది. పొలాల్లో ఎండుగడ్డి తడిచిపోయింది ప్రతి పంటలోనూ ఎండుగడ్డి మాసూళ్ళు రైతులకు సవాల్ గా మారుతోంది. ఒకవైపు పంట మాసూళ్లతో పాటు మరోవైపు పశువుల కోసం ఎండుగడ్డి మానూళ్లు కత్తిమీద సాములా మారింది. తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు చాలాశాతం ఎండుగడ్డి పొలాల్లో తడిచిపోయింది. ఏడాదికి ఎండు పశు గ్రాసంగా సుమారు 12 లక్షల మెట్రిక్ బస్సులు కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు మాసూళ్లు అయిన ఎండుగడ్డి నాలుగు నెలలకు మించి సరిపోదని రైతులు అంటున్నారు. గత వంటలో ట్రాక్టర్ ఎండుగడ్డి రూ.8వేలు ఉంటే ఈసారి రూ.10 వేల నుంచి రూ.15 వేలు వరకు అమ్ముతున్నారు. మిషన్ ద్వారా చుట్టిన మోపు రూ.35కు అమ్ముతున్నారు. తుఫాన్లు, ఆకాల వర్షాలతో ఏడాదిలో సగం గడ్డి మాత్రమే మాసూళ్లు అయ్యాయి.

### తీవ్రంగా పశుగ్రాసం కొరత..

జిల్లా అంతటా పశుగ్రాసం కొరత తీవ్ర రూపం దాల్చింది. పశుగ్రాసం కోసం రైతులు చాలా ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోంది. ఓ వైపు తాగునీరు, మరో వైపు పశుగ్రాసం లభించక పశువులు బక్కచిక్కి పోతున్నాయి. దీంతో రైతులకు పశు పోషణ భారం కావడంతో కబేళాలకు అమ్మేస్తున్నారు. ఇక పట్టణ ప్రాంతంలో పశువుల తీరు దయనీయంగా మారింది. గ్రాసం దొరకక చెత్త కుప్పలపై ఉన్న కాగితాలను, ప్లాస్టిక్ కవర్లను తింటూ మురికి కాలువల్లో నీటిని తాగుతూ వ్యాధుల బారిన పడుతున్నాయి. గ్రాసం ధర పెరిగింది దీంతో పశుపు పోషణ భారం అవుతుంది.. వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ ఎంచుకున్నాం. ఎనిమిది సంవత్సరాల నుంచి నాలుగు పాడి పశువు పెట్టుకొని జీవనం సాగిస్తాన్నం పశువుల పోషణకు నెలకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ. 20 వేలు ఖర్చు అవుతుంది. పశుగ్రాసం ధర విపరీతంగా పెరగడం వల్ల పశువులు, పోషణ భారం ఆయిందని వాటిని అమ్మడానికి నిర్ణయించుకున్నామన్నారు.

# ఒకే వేదికపై ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

### బుట్టాయగూడెంలో నిర్వహించిన జనవాణికి ప్రజల భారీ స్పందన
### భూ సమస్యలు, పింఛన్లు, తాగునీటి సమస్యలపై వినతుల స్వీకరణ
### ప్రతి వినతికి గడువులో పరిష్కారం చూపాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు





**పోలవరం ప్రతినిధి, మే 19 (ప్రజా ప్రతిభ) :**

పోలవరం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్పష్టం చేశారు. బుట్టాయగూడెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జనవాణి' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జనవాణి కార్యక్రమంలో ప్రధానంగా భూ వివాదాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, తాగునీటి సమస్యలు, రహదారుల మరమ్మత్తులు, విద్యుత్ సమస్యలు, ఉపాధి హామీ పనులు, వైద్య సేవలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన అనేక వినతులు ప్రజలు సమర్పించారు. ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా ఓర్పుతో విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా ప్రజలకు స్పందనాత్మక పాలన అందించాలని అధికారులను సూచించారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు మాట్లాడుతూ ప్రజల నమ్మకంతోనే తాము ప్రజాప్రతినిధులుగా ఉన్నామని, ప్రజలకు సేవ చేయడం తమ బాధ్యత అని అన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై సమస్యలను స్వీకరించి పరిష్కరించాలనే లక్ష్యంతో 'జనవాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి వినతిని బాధ్యతగా తీసుకుని గడువులోగా పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా స్పందనతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల విస్తరణ, వైద్య సేవల మెరుగుదల, విద్యా రంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జనవాణి కార్యక్రమానికి హాజరైన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోరారు. సమస్యలను ఓర్పుతో విని స్పందించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకోవడం ప్రజాస్వామ్య పరిపాలనలో మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాములు నాయక్, తహసీల్దార్ రాధాకృష్ణ, పలు శాఖల అధికారులు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, మండల అధ్యక్షుడు బుచ్చిరాజు, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, టీడీపీ నాయకులు కృష్ణమోహన్, కరాటం సునీల్, మారిశెట్టి అనిల్, కొప్పుల రాజేష్, పూనెం రాజా, తీగల గోపాలకృష్ణ, త్రుష్టి వెంకటేష్, సింగంశెట్టి మనోహర్, పద్మరాజు, నాగు, ఏలేటి ఏడుకొండలు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు అవసరమైన సదుపాయాల కల్పన

## వంకవారిగూడెం గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలకు టెంట్ ఏర్పాటు

## తాగునీటి డబ్బాలు, ప్రథమ చికిత్స పెట్టె, మజ్జిగ పంపిణీ

## కూలీల సంక్షేమానికి పాయం శ్రీను సహకారం

జీలుగుమిల్లి, మే 19 (ప్రజా ప్రతిభ) :



వంకవారిగూడెం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీల కోసం అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి శ్రామికులకు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్ ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి కోసం వాటర్ టిన్‌లు, అత్యవసర అవసరాల కోసం ప్రథమ చికిత్స పెట్టె అందజేశారు. అదనంగా శ్రామికులకు మజ్జిగ పంపిణీ చేసి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఈ సేవా కార్యక్రమానికి పాయం శ్రీను సహకారం అందించడం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఎండల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇలాంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కూలీల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా టెంట్, తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స పెట్టె ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు కూలీల సంక్షేమం పట్ల సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన పాయం శ్రీనును గ్రామస్థులు అభినందించారు.

# పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య పరీక్షలు

## ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య శిబిరం

## పోలీస్ సిబ్బందికి బీపీ, చక్కెర, రక్త పరీక్షలు నిర్వహణ

## అవసరమైన వారికి గుండె పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం

జీలుగుమిల్లి, మే 19 (ప్రజా ప్రతిభ) :




జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ మణికంతేశ్వర్ పర్యవేక్షణలో సిబ్బందికి పలు వైద్య పరీక్షలు చేపట్టారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ ఒత్తిడిలో పనిచేసే పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిస్థితులను పరిశీలించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.
శిబిరంలో సుమారు 20 మంది పోలీస్ సిబ్బందికి రక్తపోటు, చక్కెర స్థాయిలు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి గుండె సంబంధిత పరీక్షలు కూడా చేసి వైద్య సూచనలు అందించారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. సమయానికి జాగ్రత్తలు తీసుకుంటే రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను అదుపులో ఉంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూరం ప్రసాద్, వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని పలువురు అభిప్రాయపడ్డారు.

# సుందరయ్య ఆశయాలు సమాజానికి మార్గదర్శకం

## బుట్టాయగూడెంలో సుందరయ్య 44వ వర్ధంతి సభ నిర్వహణ

## పేదల హక్కుల కోసం సుందరయ్య చేసిన పోరాటాలకు నివాళి

## సామాజిక సమానత్వం కోసం ఆయన సేవలు చిరస్మరణీయమన్న నాయకులు

పోలవరం ప్రతినిధి, మే 19 (ప్రజా ప్రతిభ) :

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 44వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ సుందరయ్య జీవితాంతం పేదల హక్కులు, సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహానేత అని కొనియాడారు. రైతులు, కార్మికులు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు తొలగించి అందరికీ సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ఆయన చేసిన పోరాటాలు నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. సామాజిక న్యాయం, ప్రజా హక్కుల పరిరక్షణ కోసం సుందరయ్య చూపిన మార్గంలో నడవాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సుందరయ్య సేవలను స్మరించుకున్నారు.



# విజయవాడలో కాంగ్రెస్ అగ్రనేతలతో మహబూబ్ వలి కీలక భేటీ..

## రాష్ట్ర రాజకీయాలు, పార్టీ బలోపేతంపై సుదీర్ఘ చర్చ...

## ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కాంగ్రెస్ పునర్వ్యవస్థీకరణకు కార్యాచరణ..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):

రాష్ట్ర రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాల మధ్య ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ వలి విజయవాడలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో కీలక భేటీలు నిర్వహించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. పార్టీ భవిష్యత్ కార్యాచరణ, గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే వ్యూహాలు, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి వంటి పలు అంశాలపై ఈ సమావేశాల్లో విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిసింది. విజయవాడలో జరిగిన ఈ సమావేశాల్లో కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎన్. రఘువీరా రెడ్డి, ప్రస్తుత ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డిని మహబూబ్ వలి వేర్వేరుగా కలిసి మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత దూకుడుగా ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డట్లు తెలిసింది. ముఖ్యంగా రైతులు, యువత, మహిళలు, మైనార్టీలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల మధ్య బలంగా తీసుకెళ్లాలని సూచించినట్లు సమాచారం. గ్రామ స్థాయిలో పార్టీ కమిటీల పునర్వ్యవస్థీకరణ, క్రియాశీల కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, సోషల్ మీడియా ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో భారీ స్థాయిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా మహబూబ్ వలి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై ప్రజల్లో మళ్లీ విశ్వాసం పెరుగుతోందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే పార్టీగా కాంగ్రెస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం గళమెత్తుతోందని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి మండలం, ప్రతి గ్రామంలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల మధ్య ఉండే నాయకత్వానికే భవిష్యత్‌లో ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, రైతుల ఇబ్బందులు, సామాన్య ప్రజల ఆర్థిక కష్టాలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ముందుంటుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని తిరిగి బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని నాయకులు ఈ సందర్భంగా సూచించినట్లు తెలిసింది. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని ఉద్యమాల రూపంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చినట్లు సమాచారం. రాష్ట్ర రాజకీయాల్లో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్న వేళ, విజయవాడలో జరిగిన ఈ భేటీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపే దిశగా ఈ సమావేశాలు ఉపయోగపడతాయని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.



# బంగారు పతకం సాధించిన గుమ్మళ్ళపు అక్షయ...






వెంకటగిరి, మే19(ప్రజా ప్రతిభ ):

వెంకటగిరి పట్టణానికి చెందిన వైసిపి సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్, పెంచలకోన దేవస్థానం మాజీ సభ్యుడు గుమ్మళ్ళపు ఢిల్లీ బాబు , అరుణ కుమార్తె డాక్టర్ అక్షయ బంగారు పతకం సాధించారు. తమిళనాడులోని పాండిచ్చేరిలో డాక్టర్ అక్షయ ఎంబిబిఎస్ పూర్తి చేశారు. మాస్టర్ ఆఫ్ సర్జన్ కోర్సును కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ లోని శ్రీ దేవరాజ్ యువర్స్ అకాడమీ ఆఫ్ హెయిర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కేంద్రంలో(జ్వాలప్ప మెడికల్ కళాశాల) పూర్తి చేశారు. ఈ క్రమంలో మాస్టర్ సర్జన్ గైనకాలజిస్ట్ (2022బి2023)విభాగంలో అత్యధిక మార్కులు సాధించి కళాశాల ప్రథమంగా నిలిచి ఆమె బంగారు పతకం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ డైరెక్టర్ తిమ్మప్ప హెగ్డే, గౌరవ చాన్సలర్ నాగరాజు,వైస్ చాన్సలర్ వెంగమాంబ, చేతుల మీదుగా మాస్టర్ సర్జన్ పత్రం,బంగారు పతకం అందుకున్నారు. బంగారు పతకం సాధించిన విద్యార్థిని అక్షయను పట్టణంలోని ప్రముఖులు, బంధు మిత్రులు, ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీ శ్రీ శ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారు ఉత్సవాలలో పాల్గొన్న నేదురుమల్లి..





వెంకటగిరి, మే 19(ప్రజా ప్రతిభ ):

వాకాడు మండలం గొల్లపాళెం గ్రామ పంచాయతీలో వెలిసియున్న శ్రీ శ్రీ శ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవాలకు విచ్చేసిన వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని అమ్మవారి ఆలయ ధర్మకర్త పాపా రెడ్డి మనోజ్ కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. అనంతరం రామ్ కుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మనోజ్ కుమార్ రెడ్డి రామ్ కుమార్ రెడ్డి కి తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. ఆయన వెంట వెంట వాకాడు, కోట చిట్టమూరు మండలాలకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు, తదితరులు ఉన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన

# ఇన్‌చార్జ్ డీఈవో సుబ్బారావు..

### విద్యా ప్రమాణాల మెరుగుదలే లక్ష్యమని వెల్లడి..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):



మార్కాపురం మండలం దరిమడుగు గ్రామంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జ్ డీఈవోగా సామా సుబ్బారావు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా విద్యాశాఖ పరిపాలనా బాధ్యతలను చేపట్టిన ఆయనకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.ప్రకాశం జిల్లా మైనంపాడు ప్రభుత్వ డైట్ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న సామా సుబ్బారావును జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా నియమిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యాలయంలో సందడి నెలకొంది. పలువురు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది సుబ్బారావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.సుదీర్ఘకాలంగా విద్యారంగంలో సేవలందిస్తున్న సుబ్బారావుకు విద్యా పరిపాలనపై మంచి అనుభవం ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, ఉపాధ్యాయుల శిక్షణ, విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల అభివృద్ధిపై ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు శాతం పెంపు, పదో తరగతి ఫలితాల మెరుగుదల, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలు ప్రస్తుతం విద్యాశాఖ ముందున్న ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని విద్యావర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త బాధ్యతలు చేపట్టిన సుబ్బారావు సమన్వయంతో పనిచేస్తూ విద్యారంగంలో మార్పులు తీసుకువస్తారని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపొందించే దిశగా చర్యలు అవసరమని విద్యావేత్తలు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో జిల్లా విద్యాశాఖ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.జిల్లాలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల సమస్యలు, విద్యార్థుల డ్రాప్‌అవుట్ శాతం వంటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేస్తేనే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని పలువురు పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సుబ్బారావు నాయకత్వంలో జిల్లాలో విద్యారంగానికి కొత్త ఊపు వస్తుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఇర్ల రంగయ్య మృతికి

# నివాళులర్పించిన అన్నా రాంబాబు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):

కొనకనమిట్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఇర్ల రంగయ్య అనారోగ్యంతో మృతిచెందడం గ్రామంలో విషాదాన్ని నింపింది. విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజీ శాసనసభ్యుడు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు మంగళవారం బ్రాహ్మణపల్లికి చేరుకుని రంగయ్య పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన అన్నా రాంబాబు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామస్థులతో మాట్లాడి రంగయ్య సేవలను స్మరించుకున్నారు.రంగయ్య గ్రామంలో అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ మంచి వ్యక్తిగా గుర్తింపు పొందారని స్థానికులు తెలిపారు. గ్రామ ప్రజలతో ఆప్యాయంగా కలిసిమెలిసి ఉండే స్వభావం కలిగిన వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉందని పేర్కొన్నారు. ఆయన మృతి గ్రామానికి తీరని లోటని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.అన్నా రాంబాబు రాకతో బ్రాహ్మణపల్లిలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రంగయ్య కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కూడా పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, రంగయ్య అంత్యక్రియలకు గ్రామ ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పాల్గొన్నారు.




# చెన్నకేశవస్వామి కోనేరు పరిశుభ్రతపై ప్రజల ఆందోళన..

### పవిత్ర కోనేరును శుభ్రంగా ఉంచాలని కలెక్టర్‌కు వినతి..

### చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో భక్తులకు ఇబ్బందులు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం పట్టణంలోని పురాతన, పవిత్ర క్షేత్రంగా పేరుగాంచిన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కోనేరు పరిశుభ్రతపై స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోనేరు పరిసరాల్లో పెరిగిపోతున్న చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, నిర్లక్ష్యంగా మారిన ప్రహరీ గోడల కారణంగా భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా సెక్రెటరీ మద్దెల లక్ష్మి, పట్టణ ప్రధాన కార్యదర్శి గొళ్ళ సతీష్ కుమార్ కలిసి కోనేరు పరిశుభ్రత కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మార్కాపురం పట్టణంలోని కోనేటి బజారు 3,4 వార్డులకు చెందిన ప్రజలు కూడా కోనేరు పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ కోనేరు అనేక ఏళ్లుగా భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి కేంద్రబిందువుగా నిలుస్తోందని, ప్రతి రోజు వందలాది మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకునేందుకు వస్తుంటారని పేర్కొన్నారు. అలాంటి పవిత్ర ప్రదేశం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.కోనేరు నీటిలో చెత్త పేరుకుపోవడం, చుట్టుపక్కల పిచ్చి మొక్కలు పెరిగిపోవడం వల్ల దోమలు, దుర్వాసన సమస్యలు అధికమవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే కోనేరు చుట్టూ ఉన్న ప్రహరీ గోడ కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్న స్థితిలో ఉండటంతో భద్రతాపరమైన సమస్యలు కూడా తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.పవిత్ర క్షేత్రాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ఆలయ కోనేరుల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. నెలకు ఒకసారి కాకుండా వారానికి ఒకసారి ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తే కోనేరు పరిశుభ్రంగా ఉండటంతో పాటు భక్తులకు సౌకర్యంగా ఉంటుందని సూచిస్తున్నారు.భక్తుల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన లక్ష్మీ చెన్నకేశవస్వామి కోనేరును సంరక్షించేందుకు మున్సిపల్ అధికారులు, దేవాదాయ శాఖ సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కోనేరు పరిసరాలను అందంగా తీర్చిదిద్దితే పట్టణానికి మరింత ఆధ్యాత్మిక శోభ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు.



# సామాన్యుడి బతుకుపై ధరల పిడుగు..

### పెట్రోల్, డీజిల్ మోతతో మధ్యతరగతి విలవిల..

### పాలకులకు కోట్ల భోగాలు.. ప్రజలకు అప్పుల భారాలు..

### బహుళ పెన్షన్లు, విలాసాలపై పెరుగుతున్న ఆగ్రహం..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):

దేశవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాల జీవితాలను సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. నాలుగు రోజుల వ్యవధిలోనే రెండుసార్లు ఇంధన ధరలు పెరగడం, నిన్న కాకమొన్న సైలెంట్‌గా వంటగ్యాస్ సిలిండర్లు, సీఎన్‌జీ ధరలు కూడా పెరగడంతో ప్రజల జీవనం మరింత భారంగా మారిందనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పెరిగిన కరెంట్ ఛార్జీలు, ఇంటి అద్దెలు, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు, ఆసుపత్రి ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న కుటుంబాలకు ఇంధన ధరల పెంపు మరో భారీ దెబ్బగా మారిందని ప్రజలు చెబుతున్నారు. లీటరుకు కొన్ని పైసలే పెరిగాయని ప్రభుత్వాలు చెప్పినా, ఆ ప్రభావం మాత్రం మార్కెట్‌లో ప్రతి వస్తువుపై పడుతోందని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన వెంటనే రవాణా ఖర్చులు పెరిగి, కూరగాయల నుంచి కిరాణా సరుకుల వరకు అన్నింటి ధరలు అమాంతం పెరుగుతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం మార్కెట్‌కు వెళ్లే సామాన్య కుటుంబం చేతిలో ఉన్న డబ్బుతో సగం సరుకులు కూడా కొనలేని పరిస్థితి ఏర్పడిందని మహిళలు చెబుతున్నారు. మధ్యతరగతి ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏళ్ల తరబడి జీతాలు పెరగకపోయినా ఖర్చులు మాత్రం ప్రతి నెలా రెట్టింపు అవుతున్నాయని చెబుతున్నారు. నెలాఖరు వచ్చేసరికి జీతం మొత్తం బిల్లులకే సరిపోతోందని, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, ఇంటి అవసరాల కోసం అప్పులు చేయక తప్పడం లేదని కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రోజంతా కష్టపడి పనిచేసే సామాన్యుడు ఒకపక్క ధరల భారంతో నలిగిపోతుంటే, మరోవైపు రాజకీయ నాయకుల విలాసవంతమైన జీవనశైలి ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రజల పన్నుల సొమ్ముతో కోట్ల రూపాయల జీతాలు, ప్రయాణ భత్యాలు, అలవెన్సులు, ప్రభుత్వ సౌకర్యాలు అందుకుంటున్న నాయకులపై సామాన్యుల్లో వ్యతిరేకత పెరుగుతోందని చెబుతున్నారు. ప్రత్యేకంగా మాజీ ప్రజాప్రతినిధులకు కల్పిస్తున్న బహుళ పెన్షన్ల వ్యవస్థపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకే వ్యక్తి ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా పనిచేస్తే ప్రతి పదవికి వేర్వేరుగా పెన్షన్లు అందుకోవడం సామాన్య ప్రజల్లో అసహనాన్ని పెంచుతోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. జీవితాంతం ప్రభుత్వ ఉద్యోగం చేసిన ఉద్యోగికి కూడా సరైన పెన్షన్ రావడం కష్టమవుతుంటే, కొద్ది కాలం ప్రజాప్రతినిధిగా పనిచేసిన నాయకులకు కోట్ల రూపాయల సౌకర్యాలు కొనసాగడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజాసేవ పేరుతో అధికారంలోకి వచ్చి, తర్వాత ప్రజల డబ్బుతో రాజభోగాలు అనుభవించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పలువురు పేర్కొంటున్నారు. నాయకులకు ఉచిత విద్యుత్, విలాసవంతమైన బంగ్లాలు, అపరిమిత ఫోన్ సదుపాయాలు, ఉచిత ప్రయాణాలు, భారీ భద్రతా ఏర్పాట్లు వంటి సౌకర్యాలపై కూడా ప్రజల్లో చర్చ జరుగుతోంది. సామాన్యుడు విద్యుత్ బిల్లు చెల్లించలేక ఇబ్బందులు పడుతుంటే, ప్రజాప్రతినిధులకు మాత్రం అపరిమిత సౌకర్యాలు కొనసాగడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థపై భారాన్ని తగ్గించాలంటే ముందుగా రాజకీయ వ్యవస్థలోనే సంస్కరణలు రావాలని పలు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. మాజీ ప్రజాప్రతినిధుల పెన్షన్లకు పరిమితులు విధించడం, బహుళ పెన్షన్ల విధానాన్ని రద్దు చేయడం, ప్రజాప్రతినిధుల జీతభత్యాలను సాధారణ ప్రభుత్వ ఉన్నతాధికారుల స్థాయికి పరిమితం చేయడం వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఇంకా నాయకులకు కల్పిస్తున్న విలాస సదుపాయాలపై కత్తెర వేస్తే ప్రభుత్వానికి భారీగా నిధులు ఆదా అవుతాయని, ఆ నిధులను పెట్రోల్, డీజిల్ సబ్సిడీలకు, పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తే ప్రజలకు కొంత ఊరట లభిస్తుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. దేశంలో పన్నులు కట్టేది సామాన్యుడే అయినా, ఆ సొమ్ముతో విలాసాలు అనుభవించేది పాలక వర్గాలేననే భావన రోజురోజుకు బలపడుతోందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు అనే భావన కేవలం మాటలకే పరిమితం కాకుండా, పాలకులు కూడా సామాన్యుడి జీవితాన్ని అర్థం చేసుకునే విధంగా వ్యవస్థ మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇంధన ధరల పెంపు ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద పడుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రవాణా ఖర్చులు పెరగడం వల్ల పరిశ్రమలు, వ్యవసాయం, చిన్న వ్యాపారాలు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికే మార్కెట్ మందగమనంతో ఇబ్బందులు పడుతున్న చిన్న వ్యాపారులకు పెరిగిన ఇంధన ధరలు మరింత భారంగా మారాయని పేర్కొంటున్నారు. సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు రోజురోజుకు దిగజారుతున్న ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఇంధన ధరల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే రానున్న రోజుల్లో మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.




# పేదరిక నిర్మూలనకు సమాజం మొత్తం ముందుకు రావాలి..

### 2029 నాటికి సంపూర్ణ పేదరిక నిర్మూలనే లక్ష్యం..

### బలమైన వర్గాలు పేద కుటుంబాలకు అండగా నిలవాలి..

### బేస్తవారిపేటలో పీ4 కార్యక్రమానికి విశేష స్పందన..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):

మార్కాపురం జిల్లా బేస్తవారిపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పీ4 కార్యక్రమం సామాజిక బాధ్యత, పేదరిక నిర్మూలన, సేవా భావం, ఆర్థిక స్వావలంబన వంటి అంశాలపై విస్తృత చర్చకు వేదికగా నిలిచింది. రాష్ట్రంలో 2029 నాటికి సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, సేవా సంస్థలు, ఆర్థికంగా బలమైన వర్గాలు, సామాన్య ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గాలంటే బలమైన వర్గాలు ముందుకు రావాలని సూచించారు. ముఖ్యంగా ఆర్థికంగా స్థిరంగా ఉన్న టాప్ 10 శాతం వర్గాలు అత్యంత పేద 20 శాతం కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా జీవనోపాధి, ఉపాధి అవకాశాలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక నిర్వహణ వంటి అంశాల్లో కూడా మార్గదర్శకత్వం అందించాలని పేర్కొన్నారు.పేదరికం అనేది కేవలం డబ్బుల కొరత మాత్రమే కాదని, అవకాశాల లేమి, అవగాహన లోపం, ఉపాధి కొరత కూడా ప్రధాన కారణాలని కలెక్టర్ వివరించారు. పేద కుటుంబాలు ఎప్పటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడే పరిస్థితి నుంచి బయటపడాలని, స్వయం ఉపాధి దిశగా ఎదగాలని సూచించారు. చిన్న వ్యాపారాలు, పశుపోషణ, కుట్టు పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి అవకాశాలు వంటి రంగాల్లో పేద కుటుంబాలకు ప్రోత్సాహం కల్పిస్తే వారి జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావచ్చని తెలిపారు.ప్రతి ఒక్కరూ సమాజానికి తమ వంతు సేవ చేయాలనే ఆలోచనతో ముందుకు వస్తే గ్రామీణ స్థాయిలోనే గొప్ప మార్పు సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. చిన్న సహాయం కూడా ఒక కుటుంబ భవిష్యత్తును మార్చగలదని, సేవా భావంతో చేసే సహాయం ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా ఎదిగిన వారు తిరిగి సమాజానికే సేవ చేయడం ద్వారా నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.పరోపకారం ద్వారా లభించే ఆత్మసంతృప్తి ఎలాంటి సంపదతోనూ దొరకదని కలెక్టర్ వ్యాఖ్యానించారు. మన చుట్టూ ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కావాలని, సామాజిక స్పృహ పెరిగినప్పుడే సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. సమాజంలో చివరి వ్యక్తి కూడా ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.పేదరికం నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు సేవా సంస్థలు, దాతలు, యువత కూడా భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు.బేస్తవారిపేటలో తొలి విడతగా 100 కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ఆర్థిక సహాయం అందిస్తున్న సెయింట్ ఫౌండేషన్ సేవలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఒక్కో కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు.బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందిన సెయింట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్ రెడ్డి ఏకంగా 716 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం సామాజిక సేవకు నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పేద ప్రజలు ప్రభుత్వం, సేవా సంస్థలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే సూచించారు. సహాయం అందిన వెంటనే వినియోగించుకోవడం మాత్రమే కాకుండా దీర్ఘకాలిక ఆదాయ మార్గాలను ఏర్పరుచుకునే దిశగా ఆలోచించాలని కోరారు. కుటుంబాల భవిష్యత్తు కోసం విద్య, ఉపాధి, పొదుపు అలవాట్లపై దృష్టి పెట్టాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా అనేక కుటుంబాలు కనీస అవసరాల కోసం కూడా ఇబ్బందులు పడుతున్నాయని, ఇటువంటి కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలతో పాటు వ్యక్తిగత సహాయం అందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. పేదరికం నిర్మూలన అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజం మొత్తం కలిసి తీసుకోవాల్సిన బాధ్యత అని కార్యక్రమంలో పలువురు పేర్కొన్నారు.కార్యక్రమంలో డీఆర్‌ఓ వెంకట శివరామిరెడ్డి, డీఎల్డీఓ బాలు నాయక్, ఎంపీడీవో రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాలు, యువత, గ్రామస్థులు, సేవా సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు. బేస్తవారిపేటలో నిర్వహించిన ఈ పీ4 కార్యక్రమం పేదరిక నిర్మూలనకు సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.సమిష్టి కృషితోనే సమానత్వ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కార్యక్రమంలో పాల్గొన్నవారు పేర్కొన్నారు.



# గ్రామకంఠం భూముల యజమానులకు భారీ ఊరట..

## రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం కీలక నిర్ణయం..

## లింకు పత్రాలు లేకపోయినా నమోదు అవకాశం..

## ఇంటి పన్ను రశీదు, స్వయం ధ్రువీకరణతోనే ప్రక్రియ..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 19, (ప్రజా ప్రతిభ):

గ్రామకంఠం భూములు, ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల విషయంలో ఎన్నాళ్లుగానో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. గ్రామాల్లో తరతరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వేలాది కుటుంబాలకు కొత్త మార్గదర్శకాలతో స్పష్టత తీసుకువచ్చింది. లింకు పత్రాలు లేకపోవడం, పాత రికార్డులు అందుబాటులో లేకపోవడం, 22ఏ నిషేధిత జాబితా కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం వంటి సమస్యలకు ప్రభుత్వం తాజాగా చెక్ పెట్టింది. కొత్త నిబంధనల ప్రకారం గ్రామకంఠం పరిధిలో ఉన్న ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి పూర్తి స్థాయి లింకు పత్రాలు లేకపోయినా రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేయకూడదని స్పష్టం చేసినట్లు తెలిసింది. కేవలం ఇంటి పన్ను రశీదు లేదా ఖాళీ స్థల పన్ను రికార్డులు ఉన్నా సరిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం కానుంది. ఇప్పటివరకు పాత పత్రాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా వారసత్వంగా వచ్చిన ఇళ్ల స్థలాలు, పాతకాలం నుంచి నివాసంగా ఉపయోగిస్తున్న భూములకు సరైన పత్రాలు లేక రిజిస్ట్రేషన్లు జరగక వేలాది కుటుంబాలు ఆందోళనలో జీవించాయి. బ్యాంకు రుణాలు పొందడం, ఆస్తులను విక్రయించడం, వారసత్వ బదిలీలు చేయడం వంటి అంశాల్లో కూడా ప్రజలు సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామకంఠం భూముల యజమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇంటి పన్ను, ఖాళీ స్థల పన్ను చెల్లింపు రశీదులను ఆధారంగా తీసుకుని రిజిస్ట్రేషన్లు చేపట్టాలని సూచించడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరట లభించనుంది. ఇంకా ముఖ్యంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములు అయినప్పటికీ అవి గ్రామకంఠం పరిధిలోకి వస్తే రిజిస్ట్రేషన్ నిలిపివేయకూడదని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం కారణంగా ఇప్పటివరకు వివాదాల్లో చిక్కుకున్న అనేక గ్రామకంఠం ఆస్తుల రిజిస్ట్రేషన్లు కూడా ముందుకు సాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఏ విధమైన పాత పత్రాలు అందుబాటులో లేకపోయినా స్వయం ధ్రువీకరణ ఆధారంగా కూడా రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించడం మరో కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది వద్ద పాతకాలపు రికార్డులు లేకపోవడంతో వారు ఎన్నాళ్లుగానో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు స్వయం ధ్రువీకరణకు అవకాశం ఇవ్వడంతో ఆ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద మేలు జరుగుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో చిన్న చిన్న ఇళ్ల స్థలాల కోసం సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగిన ప్రజలకు ఈ నిర్ణయం ఊరటనిచ్చిందని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామకంఠం భూముల సమస్య చాలా కాలంగా కొనసాగుతోందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామాల విస్తరణ, జనాభా పెరుగుదల కారణంగా అనేక కుటుంబాలు పాతకాలం నుంచి నివాసంగా ఉపయోగిస్తున్న భూములకు సరైన రికార్డులు లేకపోవడం సాధారణమైందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గ్రామీణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకున్నదిగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సులభతరం కావడంతో భవిష్యత్తులో గ్రామకంఠం భూములపై వివాదాలు కూడా తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. అధికారిక రిజిస్ట్రేషన్లు జరిగితే ఆస్తులపై యాజమాన్య హక్కులకు చట్టబద్ధత లభించడంతో పాటు భవిష్యత్తు తరాలకు కూడా భద్రత కలుగుతుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం అమలులోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా వేలాది కుటుంబాలు లాభపడే అవకాశముందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యలకు పరిష్కారం దొరికిందన్న భావన ప్రజల్లో కనిపిస్తోంది.




# పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం భరోసా

## ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

## ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో క్యాన్సర్ బాధితురాలికి రూ. 4 లక్షల ఎల్ఓసీ అందజేత.



శృంగవరపుకోట మే 19 (ప్రజా ప్రతిభ- ఎం.రమణ)

ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని శృంగవరపుకోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం ఎల్.కోటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్. ఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎల్.కోట గ్రామానికి చెందిన బంగారు వెంకటేశ్వరమ్మ అనే మహిళ గత కొంతకాలంగా క్యాన్సర్ మహమ్మారితో బాధపడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆమె తక్షణమే స్పందించారు. వెంకటేశ్వరమ్మ మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుండి రూ. 4 లక్షల విలువైన ఎల్ఓసీ మంజూరు చేయించి, ఆ పత్రాలను ఈరోజు బాధితురాలి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఇంత పెద్ద మొత్తంలో వైద్య సహాయం అందించడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించి సహాయం చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చొక్కాకుల మల్లు నాయుడు, ఎంపీటీసీ రాయవరపు చంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ గేదెల దేముడు మాస్టర్, స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిమిడి గ్రామంలో ఘనంగా ‘కిశోరీ వికాసం’ అవగాహన సదస్సు

## ముఖ్య అతిథిగా హాజరైన జనసేన

## నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు

శృంగవరపుకోట, మే 19. (ప్రజా ప్రతిభ- ఎం. రమణ)

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ (ఎస్. కోట) ఆధ్వర్యంలో మంగళవారం తిమిడి గ్రామంలో “కిశోరీ వికాసం” సమ్మర్ క్యాంపైన్ అవగాహన సదస్సును అత్యంత విజయవంతంగా నిర్వహించారు. కిశోర బాలికల విద్యాభివృద్ధి, రక్షణ మరియు ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్.కోట నియోజకవర్గ జనసేన నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కిశోర బాలికలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. నేటి బాలికలే రేపటి దేశ భవిష్యత్తు అని, వారు చదువులోనూ, అన్ని రంగాల్లోనూ రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. బాలికల రక్షణ, విద్య మరియు హక్కుల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు.?అనంతరం ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ పి. సుశీల మాట్లాడుతూ బాలికలకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు:విద్య మరియు ఆరోగ్యం: బాలికల ఉన్నత విద్యా ప్రాధాన్యతను, పౌష్టికాహారం మరియు శారీరక, మానసిక ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.?బాల్య వివాహాల నిర్మూలన: బాల్య వివాహాల వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను వివరించి, వాటిని పూర్తిగా అరికట్టాలని కోరారు.?మహిళా చట్టాలు - రక్షణ: ఆపద సమయంలో బాలికలు, మహిళలు ఆశ్రయించాల్సిన అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లపై మరియు వారి రక్షణకు ఉన్న




చట్టాలపై సమగ్ర సమాచారాన్ని అందించారు.?ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా వినియోగం పట్ల బాలికలు ఎంత అప్రమత్తంగా ఉండాలో, దానివల్ల కలిగే లాభనష్టాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా బాలికల హక్కుల పరిరక్షణకై మరియు బాల్య వివాహాల నిర్మూలనకై అందరితో చేతులు చాచి ప్రతిజ్ఞ చేయించారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది, మహిళా పోలీస్, కిశోర బాలికలు మరియు గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# జగనన్న కాలనీలో భారీగా కబ్జాలు?

## పరవాడలోని సర్వే నంబర్ 1లో జోరుగా ఆక్రమణలు

## ఖాళీ స్థలాల్లో అక్రమ షెడ్లు, నిర్మాణాలు

## అధికారుల మౌనం వెనుక ముడుపుల ఆరోపణలు!

## అక్రమ నిర్మాణాలపై ప్రజా సంఘాల ఆగ్రహం




విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరిధిలోని సర్వే నంబర్ 1 సర్విజ్ఞ స్కూలు పరిసర ప్రాంతంలో అలాగే వెన్నెలపాలెం గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో భారీ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. గత వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో నిరుపేదలకు 20o22 గజాల చొప్పున కేటాయించిన స్థలాల్లో, ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్లాట్లను కొందరు ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. చదును చేసుకుని మొక్కలు నాటిన పేరుతో మొదలైన ఈ ఆక్రమణలు ఇప్పుడు భారీ షెడ్లు, శాశ్వత నిర్మాణాల దాకా వెళ్లడం ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలిస్తోంది. స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం, అసలు లబ్ధిదారులు కాని వ్యక్తులు ఖాళీ ప్లాట్లను ఆక్రమించి “ముందుగా కబ్జా -- తర్వాత నిర్మాణం” అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ భూమిని తమ సొంత ఆస్తిలా మార్చుకునే ప్రయత్నాలు బహిరంగంగానే జరుగుతున్నా, సంబంధిత రెవెన్యూ అధికారులు మాత్రం చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, విధులు నిర్వహిస్తున్న వీఆర్వోపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముడుపులు తీసుకుని అక్రమాలకు సహకరిస్తున్నారనే అనుమానాలు గ్రామస్థులు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా “మాకు సంబంధం లేదు” అన్నట్టుగా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములు అక్రమాలకు గురవుతున్న నేపథ్యంలో, ఖాళీగా ఉన్న ప్లాట్లను నిజమైన నిరుపేదలకు కేటాయిస్తే ఎంతోమంది ఆనందపడతారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమదారులు మరింత రెచ్చిపోతూ, రేపటి రోజుల్లో పక్కా నిర్మాణాలు చేసి ప్రభుత్వాన్నే సవాల్ చేసే పరిస్థితి వస్తోందని హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన అనకాపల్లి ప్రజా సంఘ అధ్యక్షుడు మణికుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. “ప్రభుత్వ భూములు కాపాడాల్సిన అధికారులే కబ్జాదారులకుఅండగా నిలిస్తే సామాన్య ప్రజలు ఎవరిని నమ్మాలి? వెంటనే స్పందించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ఆందోళన చేపడతాం. అవసరమైతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం” అని ఆయన హెచ్చరించారు. ప్రజా సంఘాలు కూడా ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి జగనన్న కాలనీలో జరుగుతున్న అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా మాకెన సీతారాం పాత్రుడు (నవీన్)

## శృంగవరపుకోట నియోజకవర్గ చరిత్రలో తొలిసారి దక్కిన అరుదైన గౌరవం

## ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని మర్యాదపూర్వకంగా కలిసిన నవీన్

## 21న ప్రమాణస్వీకారానికి ఆహ్వానం

శృంగవరపుకోట, మే 19. (ప్రజా ప్రతిభ -ఎం. రమణ )

ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా శృంగవరపుకోట నియోజకవర్గానికి చెందిన కొత్తవలస మండలం చింతలపాలెం మాజీ సర్పంచ్, క్లస్టర్ ఇంచార్జ్ మాకెన సీతారామ్ పాత్రుడు (నవీన్) నియమితులయ్యారు. నియోజకవర్గ రాజకీయ చరిత్రలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డులో ఒక స్థానిక నాయకుడికి సభ్యుడిగా అవకాశం దక్కడం ఇదే తొలిసారి కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఎల్.కోటలోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి ని మాకెన సీతారాం పాత్రుడు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ నెల 21న జరిగే తన ప్రమాణస్వీకార మహోత్సవానికి రావాల్సిందిగా ఎమ్మెల్యే కు ఆహ్వాన పత్రికను అందజేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతారాం పాత్రుడిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శాలువాతో సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలియజేశారు .కూటమి అగ్రనేతలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ.. సింహాచలం స్వామివారి బోర్డులో ఎస్.కోట నియోజకవర్గానికి అరుదైన గౌరవాన్ని కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మన నియోజకవర్గ నాయకుడికి ఈ గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు గానూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ మరియు సింహాచలం



దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ పూసపాటి అశోక గజపతిరాజు కి నియోజకవర్గ ప్రజల తరపున, కూటమి నాయకుల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. స్వామివారి సేవలో సీతారాం పాత్రుడు (నవీన్) మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నియోజకవర్గ కీర్తిని పెంపొందించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రామ్ చరణ్‌తో తన జోడీని చిరంజీవి-శ్రీదేవి కాంబోతో పోల్చిన జాన్వీ కపూర్





టాకీస్: గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి నటిస్తున్న 'పెద్ది' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్న నటి జాన్వీ కపూర్, ముంబైలో సోమవారం జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చరణ్‌తో తన జోడీపై ప్రేక్షకులు పెట్టుకున్న అంచనాల గురించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామ్ చరణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్వీ కపూర్ మాట్లాడుతూ, "మా ఇద్దరి మధ్య ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉందని నేను అర్థం చేసుకోగలను. గతంలో చిరంజీవి గారు, మా అమ్మ శ్రీదేవి ఆన్ స్క్రీన్ జోడీని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు మమ్మల్ని వెండితెరపై చూడాలని వారు ఆసక్తిగా ఉన్నారు. ఇంత ప్రత్యేకమైన చిత్రంలో అతడితో కలిసి పనిచేయడం ఒక అద్భుతంలా అనిపించింది. అతడు నిజంగా అత్యుత్తమ వ్యక్తి" అని తెలిపారు.

చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానాపై కూడా జాన్వీ ప్రశంసలు కురిపించారు. "మేము రెండేళ్లుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాం. బుచ్చి గారు చూడటానికి చాలా అమాయకంగా కనిపిస్తారు, కానీ నిజానికి ఆయన అలా కాదు. ఇండియాలోనే ఆయన రౌడీయెస్ట్ డైరెక్టర్. నిజాయతీగా చెప్పాలంటే ఆయన నన్ను ఎన్నో విధాలుగా మార్చారు. నాకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యారు. రోజులో ఒక్కసారైనా ఆయనకు ఫోన్ చేసి మాట్లాడాల్సిందే" అని ఆమె వివరించారు.

ఈ చిత్రంలో దివ్యేందు, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'పెద్ది' చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

### తిలక్ వర్మతో అఫైర్..

## అవాస్తవం

- నటి శ్రీలీల, క్రికెటర్ తిలక్ వర్మపై వస్తున్న పుకార్లపై స్పందన
- డేటింగ్ వార్తలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమని ప్రకటన
- నిజానిజాలు తెలుసుకోకుండా కథనాలు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి



టాకీస్: ప్రముఖ నటి శ్రీలీల, యువ క్రికెటర్ తిలక్ వర్మ మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి ఆమె టీమ్ ఫుల్‌స్టాప్ పెట్టింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ పూర్తిగా నిరాధారమైన, అవాస్తవ కథనాలని అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు శ్రీలీల బృందం ఒక ప్రకటన విడుదల చేసింది.

"శ్రీలీల, తిలక్ వర్మకు సంబంధించి వ్యాప్తి చెందుతున్న పుకార్లు పూర్తిగా నిరాధారమైనవి, అసత్యమైనవి. వారిద్దరూ ఇప్పటివరకు ఒకరినొకరు కనీసం కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు కూడా. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదు. వాస్తవ నిర్ధారణ లేకుండా ఇలాంటి కల్పిత కథనాలను ప్రచారం చేయవద్దని కోరుతున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియా ఖాతాలతో పాటు పాటు కొన్ని మీడియా వేదికల్లోనూ కథనాలు వెలువడిన నేపథ్యంలో శ్రీలీల టీమ్ ఈ వివరణ ఇచ్చింది. వ్యక్తిగత విషయాలపై వార్తలు రాసేటప్పుడు మీడియా, సోషల్ మీడియా యూజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ధృవీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేసింది.

సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై తరచూ ఇలాంటి పుకార్లు రావడం సహజమే అయినప్పటికీ, ఈ ప్రచారం ఎక్కువ కావడంతో వెంటనే స్పందించి పుకార్లకు అడ్డుకట్ట వేయాలని శ్రీలీల బృందం నిర్ణయించుకుంది. ఈ అధికారిక ప్రకటనతో శ్రీలీల, తిలక్ వర్మ రిలేషన్‌షిప్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.





## నేడు ఎన్టీఆర్ బర్త్‌డే

### అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎలాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు.



## ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

### జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్

ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్‌ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు. ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్ వంటి యువ ఆటగాళ్లతో జట్టు బలంగా కనిపిస్తోంది. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్ కీలక బాధ్యతలు తీసుకోనున్నారు. వన్డే జట్టులో మాత్రం అనుభవం-యువత కలయిక కనిపిస్తోంది. కెప్టెన్‌గా మళ్లీ శుభ్‌మన్ గిల్‌కే బాధ్యతలు అప్పగించగా.. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్ వంటి సీనియర్ బ్యాటర్లు జట్టుకు బలం కానున్నారు. ఇషాన్ కిషన్ తిరిగి వన్డే సెటప్‌లో చోటు సంపాదించగా.. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి పేసర్లు అఫ్గాన్ బ్యాటర్లకు సవాల్ విసరనున్నారు.

#### అఫ్గాన్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), సాయి సుదర్శన్, రిషభ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, నితీష్ కుమార్ రెడ్డి, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, ధ్రువ్ జురెల్, హర్ష్ దూబె.

## వైభవ్ విధ్వంసం

- 38 బంతుల్లో 93
- రాజస్థాన్‌కు కీలక విజయం
- మార్ష్ పోరాటం వృథా



జైపూర్: వరుసగా మూడు ఓటములతో ప్లేఆఫ్స్ బెర్త్ ప్రమాదంలో పడిన వేళ.. రాజస్థాన్ రాయల్స్ అదరగొట్టింది. టీనేజి సంచలనం వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 10 సిక్సర్లతో 93) సొంత మైదానంలో పిడుగల్లే విరుచుకుపడ్డాడు. దీంతో మంగళవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 7 వికెట్లతో విజయం సాధించింది. ప్రస్తుతం 14 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరిన రాజస్థాన్ ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిస్తే నేరుగా ప్లేఆ?ఫ్సకు వెళ్తుంది. మ్యాచ్‌లో ముందుగా లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 220 పరుగులు చేసింది. మిచెల్ మార్ష్ (57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96), ఇన్‌గ్?ిస (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60), కెప్టెన్ రిషభ్ పంత్ (23 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 35) ధాటిగా ఆడారు. ఛేదనలో రాజస్థాన్ 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 225 పరుగులు చేసి గెలిచింది. జురెల్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 నాటౌట్), జైస్వాల్ (23 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా వైభవ్ నిలిచాడు.

**బాదుడే బాదుడు:** భారీ ఛేదనను రాజస్థాన్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. ఓపెనర్ జైస్వాల్ దూకుడును మరో ఓపెనర్ వైభవ్ తుఫాన్‌గా మార్చాడు. బంతి పడిందే ఆలస్యం అన్నట్టుగా సిక్సర్ల వర్షం కురిపించాడు. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ నాలుగు ఫోర్లతో 23 రన్స్, నాలుగో ఓవర్‌లో 6,4,4,4తో 19 రన్స్ రాబట్టాడు. అటు ఆరంభంలో నెమ్మదిగా ఆడిన వైభవ్ ఆరో ఓవర్‌లో 6,4,4తో పవర్‌ప్లేలో జట్టు 71 పరుగులకు చేరింది. ఆ వెంటనే జైస్వాల్ వెనుదిరగగా, వైభవ్ లఖ్‌నవూ బౌలర్లను బెంబేలెత్తించాడు. పేసర్ ఆకాశ్ ఓవర్‌లో 6,4,4,6,2తో 26 రన్స్ అందించిన వైభవ్ 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అటు జురెల్ 12వ ఓవర్‌లో 4,6,6, వైభవ్ 6,6లతో ఏకంగా 29 రన్స్ సమకూరాయి. వైభవ్ 93 రన్స్ దగ్గర భారీషాట్‌కు వెళ్లి వెనుదిరగడంతో, రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం ప్రిటోరియస్ (7) రనౌటైనా.. జురెల్ అర్ధసెంచరీ సాధించడంతో పాటు ఫెరీరా (16 నాటౌట్) సహకారంతో ఐదు బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

**ఓపెనర్ల దూకుడు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూకు ఓపెనర్లు మార్ష్, ఇన్‌గ్?ిస మెరుపు ఆరంభాన్ని అందించారు. రాజస్థాన్ బౌలర్లకు ఈ జోడీ ఎలాంటి అవకాశాన్ని ఇవ్వకుండా పరుగుల వరద పారించింది. ఓ దశలో 250 స్కోరు కూడా సాధ్యమే అనిపించినా.. డెత్ ఓవర్లలో పుంజుకున్న రాజస్థాన్ బౌలర్లు లఖ్‌నవూ ఆశించిన స్కోరును చేయకుండా అడ్డుకోగలిగారు. తొలి ఓవర్‌లో మార్ష్ 4,6తో జోరు చూపగా.. ఆ తర్వాత ఇన్‌గ్?ిస ఎక్కువగా స్ట్రయికింగ్ తీసుకుని చెలరేగాడు. నాలుగో ఓవర్‌లో 4,4,6తో 16 రన్స్ అందించాడు. దీంతో అతి తక్కువ బంతుల్లోనే (21) లఖ్‌నవూ తమ 50 రన్స్‌ను సాధించింది. ఇక ఐదో ఓవర్‌లో మార్ష్ 4,4,6.. ఆరో ఓవర్‌లో ఇన్‌గ్?ిస 6,4 బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 83 పరుగులతో పటిష్టంగా నిలిచింది. ఆ తర్వాత 23 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసిన ఇన్‌గ్లిస్‌ను స్పిన్నర్ యష్‌రాజ్ బౌల్డ్ చేశాడు. అప్పటికే తొలి వికెట్‌కు 49 బంతుల్లోనే 109 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. ఈ దశలో మార్ష్ బ్యాట్ ఝుళిపించాడు. అటు పూరన్ (16)ను కూడా యష్‌రాజ్ అవుట్ చేశాడు. పంత్ రాకతో 13-15 ఓవర్ల మధ్య 16 పరుగులే వచ్చాయి. ఆ తర్వాత ఇద్దరూ వేగం చూపి బౌండరీలు రాబట్టడంతో 18వ ఓవర్‌లో స్కోరు 200 దాటింది. ఆఖరి ఓవర్‌లో ఆర్చర్ ఐదు పరుగులే ఇచ్చి బదోని (0)ని బౌల్డ్ చేయగా.. పంత్, సెంచరీ ముంగిట మార్ష్ రనౌటయ్యారు.


Printed published and own by him Dr. kongarapu Ganapathi, Phone number: 9494451230, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341